ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పల్నాడు జిల్లా వార్తలు
శుక్రవారం 5 ఏప్రిల్ 2024



# చిలకలూరిపేట.. చిరకీర్తి

చిలకలూరిపేట నియోజకవర్గం కళలకు పుట్టినిల్లు, పరిశ్రమలకు నెలవు.. నాదస్వర కళ పితామహుడైన పీరుసాహెబ్, నాదబ్రహ్మ ఆదాముసాహెబ్ చిలకలూరిపేటకు చెందినవారే. సేవా కార్యక్రమాలకు కూడా పెట్టింది పేరు. ఇక్కడ ఏఎంజీ, అసిస్ట్, రోటరీ, లయన్స్ క్లబ్బుల వంటి సేవా సంస్థలు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నాయి. రాజకీయంగా కూడా కీలకమైన నియోజకవర్గం ఇది.






- పరిశ్రమలకు చిలకలూరిపేట గుర్తింపు
- ఎంతో మంది కళాకారులకు నెలవు
- సేవా కార్యక్రమాల్లోనూ మంచిపేరు

### నియోజకవర్గం ఏర్పాటైందిలా..

చిలకలూరిపేట నియోజకవర్గం 1952లో ఏరాటైంది. ఆ సమయంలో ప్రకాశం జిల్లా మార్టూరు ఫిర్కా ఇందులో అంతర్భాగంగా ఉండేది. చిలకలూరిపేట నియోజకవర్గ తొలి శాసనసభ్యునిగా (1952) కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి కరణం రంగారావు, కాంగ్రెస్ అభ్యర్థి బి.నాగయ్యపై 10,472 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అనంతరం 1955 ఎన్నికల సమయానికి చిలకలూరిపేట, చిలకలూరిపేట రూరల్ మండలాలు, మార్టూరు నియోజకవర్గంలో కలిసిపోయాయి. 1962 ఎన్నికల సమయంలో కూడా మార్టూరు పేరున ఈ నియోజకవర్గం కొనసాగింది. 1952 నుంచి 1967 వరకు ప్రస్తుతం ఉన్న నాదెండ్ల మండలం ఫిరంగిపురం నియోజకవర్గంలో, యడ్లపాడు మండలంలోని కొన్ని గ్రామాలు పెదకాకాని నియోజకవర్గంలో అంతర్భాగంగా ఉన్నాయి. 1967 ఎన్నికల సమయంలో తిరిగి చిలకలూరిపేట నియోజకవర్గంగా రూపాంతరం చెందింది. 1978 వరకు చిలకలూరిపేట నియోజకవర్గంలో నాదెండ్ల, యడ్లపాడు మండలాలు పూర్తిగా మినహాయింపుతో పాటు మార్టూరు ఫిర్కా కలిసి ఉంది. 1978 ఎన్నికల సమయంలో నియోజకవర్గాల పునర్విభజన జరిగినప్పుడు చిలకలూరిపేట పట్టణం, రూరల్ మండలం, ప్రస్తుత నాదెండ్ల మండలంలోని అన్ని గ్రామాలు, యడ్లపాడు మండలంలోని ఉన్నవ, బోయపాలెం, సందెపూడి, తుర్లపాడు, గణేశునివారిపాలెం గ్రామాలు మినహా మిగతా గ్రామాలతో చిలకలూరిపేట నియోజకవర్గం ఏర్పడింది.

చిలకలూరిపేట, ఏప్రిల్ 4: కళలకు పుట్టినిల్లుగా, పరిశ్రమలకు నెలవుగా చిలకలూరిపేట నియోజకవర్గం రాష్ట్రంలోనే తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని పొందింది. వాణిజ్య పంటల పరిశ్రమలకు ఆనవాలుగా, నాదస్వర కళలకు పుట్టినిల్లుగా, రంగస్థల కళలకు మెట్టినిల్లుగా చిరకీర్తిని పొందిన ఘనత చిలకలూరిపేటది. నాదస్వర కళ పితామహుడైన పీరుసాహెబ్, నాదబ్రహ్మ ఆదాముసాహెబ్ చిలకలూరిపేటకు చెందినవారే. పద్మశ్రీ బిరుదాంకితులైన షేక్ చినమౌలానా చిలకలూరిపేటలో నాదస్వర విద్యను అభ్యసించిన వారే. తమిళనాడులో ప్రముఖ నాదస్వర విద్వాంసులుగా పేరుపొందిన కళైమామని, పద్మశ్రీ పురస్కార గ్రహీతలు షేక్ మహబూబ్ సుభాని, కాలేషాబి చిలకలూరిపేటకు చెందిన వారే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో కళాకారుల కోటాలో తొలిసారిగా నామినేట్ చేయబడిన షేక్ ఆదం సాహెబ్ చిలకలూరిపేటకు చెందిన వారే. సేవా కార్యక్రమాలకు కూడా చిలకలూరిపేట పెట్టింది పేరు. ఇక్కడ ఏఎంజీ, అసిస్ట్, రోటరీ, లయన్స్ క్లబ్బుల వంటి సేవా సంస్థలు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నాయి. రెడ్డి రాజుల రాజధాని కొండవీడు చిలకలూరిపేట నియోజకవర్గం లోనిదే. మానూరి వంశస్తుల ఏలుబడిలో ఉన్నప్పుడు చిలకలూరిపాడుగా పిలువబడిన 20వ శతాబ్దం ప్రారంభం నుంచి చిలకలూరిపేటగా మారింది. తొలుత పంచాయితీగా ఉన్న చిలకలూరిపేట 1964లో మున్సిపాలిటీగా మార్చబడింది. 1931లో ఒంగోలు రహదారిలో ఓగేరు వాగుపై శాశ్వత వంతెన నిర్మించడంతో చిలకలూరిపేట అభివృద్ధి పథంలో ముందుకు సాగింది. చిలకలూరిపేట చరిత్రలో మరచిపోలేని మహా వ్యక్తులు మైలవరపు గుండయ్య, జాన్ డేవిడ్, మైలవరపు గుండయ్య కోట్ల రూపాయలు విలువచేసే భూములను దానధర్మాలుగా ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న మున్సిపల్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, పాత ప్రభుత్వ ఆసుపత్రి, గాంధీ పార్కు, ధర్మసత్రం స్థలాలు ఆయన విరాళంగా ఇచ్చినవే. చిలకలూరిపేటకు గ్రామ పంచాయతీ తొలి సర్పంచిగా ఆయన వ్యవహరించారు. జాన్ డేవిడ్ ఏఎంజీ లక్షలాదిమంది పేద ప్రజలకు ఎన్నో రకాల సేవా కార్యక్రమాలు చేశారు. పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడానికి జాన్ డేవిడ్ 200 ఎకరాల్లో రెండవ మంచినీటి చెరువును తవ్వడానికి నిధులు సమకూర్చారు. ఈ చెరువుకు మున్సిపాలిటీ వారు ఆయన పేరును పెట్టారు.

### గ్రామాలు ఒకటే.. వీధులు వేర్వేరు నియోజకవర్గాల్లో..

చిలకలూరిపేట నియోజకవర్గంలోని నాలుగు గ్రామాల్లో విచిత్ర పరిస్థితి నెలకొని ఉంది. ఈ గ్రామాల్లో నాగభైరువారిపాలెం, మిట్టపాలెం, ఆమీన్‌సాహెబ్ పాలెం, కట్టుబడివారిపాలెం ఉన్నాయి. ఈ గ్రామాల్లో ఒకవైపు వీధులు చిలకలూరిపేట నియోజకవర్గంలో ఉంటే మరొకవైపు వీధులు వేరే నియోజకవర్గాలలో ఉన్నాయి. కట్టుబడివారి పాలెం, అమీన్‌సాహెబ్ పాలెం గ్రామంలోని కొన్ని వీధులు చిలకలూరిపేట నియోజకవర్గంలో ఉంటే మరికొన్ని వీధులు నరసరావుపేట నియోజకవర్గంలో ఉన్నాయి. అలాగే మిట్టపాలెం, నాగభైరు వారిపాలెం గ్రామాల్లో కొన్ని వీధులు చిలకలూరిపేట నియోజకవర్గంలో, మరికొన్ని వీధులు పత్తిపాడు నియోజకవర్గంలో కలిసి ఉన్నాయి..

### ఎవరెవరు గెలిచారు...

ఇప్పటివరకు చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గం పేరుతో జరిగిన 12 అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం 5 సార్లు, కాంగ్రెస్ 4 సార్లు, స్వతంత్ర పార్టీ ఒకసారి, వైసీపీ ఒకసారి, ఇండిపెండెంట్ అభ్యర్థి ఒకసారి గెలుపొందారు. కాంగ్రెస్ తరపున సోమేపల్లి సాంబయ్య 5 ఎన్నికల్లో పోటీ చేసి 3 ఎన్నికల్లో గెలుపొందారు. టీడీపీ తరపున ప్రత్తిపాటి పుల్లారావు 5 ఎన్నికలలో పోటీచేసి 3 సార్లు విజయం సాధించారు. ప్రత్తిపాటి వరుసగా ఆరవసారి పోటీలో ఉండి తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. ఈ నియోజకవర్గంలో వరుసగా రెండుసార్లు ఏ అభ్యర్థి గెలవరని నానుడి ఉంది. అయితే 2009, 2014లో వరుసగా రెండుసార్లు ప్రతిపాటి పుల్లారావు టీడీపీ టికెట్‌పై గెలిచి రికార్డు సాధించారు. చిలకలూరిపేట నుంచి గెలుపొందిన వారిలో తొలిసారిగా ప్రత్తిపాటి పుల్లారావు(తెలుగుదేశం), అనంతరం విడదల రజిని (వైసీపీ) మంత్రులుగా పదవులు దక్కించుకున్నారు. బొబ్బాల సత్యనారాయణ, మర్రి రాజశేఖర్ టీటీడీ బోర్డు మెంబర్లుగా వ్యవహరించారు.

**చిలకలూరిపేట నియోజకవర్గంలో ఓట్ల వివరాలు**

| | |
|---|---|
| చిలకలూరిపేట టౌన్ | 86,169 |
| చిలకలూరిపేట మండలం | 41,774 |
| ఎడ్లపాడు మండలం | 43,957 |
| నాదెండ్ల మండలం | 52,522 |
| మొత్తం | 2,24,422 |

**చిలకలూరిపేట అసెంబ్లీ సెగ్మెంట్లో ప్రధాన కులాల ఓట్ల వివరాలు**

| | | | |
|---|---|---|---|
| కమ్మ | 35,000 | యానాది | 2,700 |
| కాపు | 23,000 | రజక | 5,000 |
| మాల | 27,000 | ముదిరాజ్ | 5,000 |
| మాదిగ | 18,000 | పద్మశాలి | 3,300 |
| ముస్లిం | 36,000 | కుమ్మరి | 3,000 |
| రెడ్డి | 8,000 | గౌడ | 2,200 |
| వైశ్య | 8,500 | నాయిబ్రాహ్మణ | 2,100 |
| వడ్డెర | 9,000 | బోయ | 1,500 |
| యాదవ | 8,500 | దూదేకులు | 1,500 |
| బ్రాహ్మణ | 2,000 | విశ్వబ్రాహ్మణ | 1,200 |
| ఎరుకల | 4,700 | దొమ్మరి | 1,300 |
| సుగాలి | 4,000 | దాసరి | 1,200 |

**సంవత్సరాల వారీగా గెలుపు ఓటమి పొందిన అభ్యర్థుల వివరాలు**

| సం. | విజేత | పార్టీ | ప్రత్యర్థి | పార్టీ | మెజార్టీ |
|---|---|---|---|---|---|
| 1952 | కరణం రంగారావు | సీపిఐ | బి.నాగయ్య | కాంగ్రెస్ | 10,472 |
| 1967 | కందిమళ్ళ బుచ్చయ్య | స్వతంత్ర | నూతి వెంకటేశ్వర్లు | కాంగ్రెస్ | 672 |
| 1972 | బొబ్బాల సత్యనారాయణ | కాంగ్రెస్ | కందిమళ్ళ బుచ్చయ్య | స్వతంత్ర | 11,076 |
| 1978 | సోమేపల్లి సాంబయ్య | కాంగ్రెస్ | భీమిరెడ్డి సుబ్బారెడ్డి | జనతా | 17,463 |
| 1983 | డాక్టర్ కాజా కృష్ణమూర్తి | టిడిపి | సోమేపల్లి సాంబయ్య | కాంగ్రెస్ | 24,666 |
| 1985 | సోమేపల్లి సాంబయ్య | కాంగ్రెస్ | మానం వెంకటేశ్వర్లు | టిడిపి | 4,874 |
| 1989 | కందిమళ్ళ జయమ్మ | టిడిపి | సోమేపల్లి సాంబయ్య | కాంగ్రెస్ | 949 |
| 1994 | సోమేపల్లి సాంబయ్య | కాంగ్రెస్ | ఎం.వి.నరసింహారావు | టిడిపి | 131 |
| 1999 | ప్రత్తిపాటి పుల్లారావు | టిడిపి | సోమేపల్లి సాంబయ్య | కాంగ్రెస్ | 26,241 |
| 2004 | మర్రి రాజశేఖర్ | ఇండిపెండెంట్ | ప్రత్తిపాటి పుల్లారావు | టిడిపి | 212 |
| 2009 | ప్రత్తిపాటి పుల్లారావు | టిడిపి | మర్రి రాజశేఖర్ | కాంగ్రెస్ | 19,813 |
| 2014 | ప్రత్తిపాటి పుల్లారావు | టిడిపి | మర్రి రాజశేఖర్ | వైసీపీ | 10,684 |
| 2019 | విడదల రజిని | వైసిపి | ప్రత్తిపాటి పుల్లారావు | టిడిపి | 8,301 |

**రంజాన్ వేళలు**
ఇఫ్తార్ (సాయంత్రం) 6.26(శుక్రవారం)
సహోరీ (ఉదయం) 4.43 (శనివారం)

నియోజకవర్గ ముఖచిత్రం



# ఎంపీ సీటు.. నాకొద్దు

- పొన్నూరు టికెట్ నాకే ఇవ్వండి
- లేదంటే గుంటూరు పశ్చిమలో అవకాశమివ్వండి
- మంత్రి రజినీని గుంటూరు లోక్‌సభకు పంపండి
- సజ్జలకు మొరపెట్టుకున్న ఎమ్మెల్యే కిలారి రోశయ్య
- ఇప్పటికే కాడి కిందపడేసి పరారైన ఉమ్మారెడ్డి వెంకటరమణ



గుంటూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ మాత్రమే వచ్చింది. ఇంకా నోటిఫికేషన్ రాలేదు.. అయితే వైసీపీ అభ్యర్థుల్లో ఓటమి భయం పట్టుకుందా అంటే.. తాజాగా నెలకొంటున్న పరిస్థితులు అవుననంటున్నాయి. గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి వైసీపీ ఎంపీ అభ్యర్థిగా రెండో కృష్ణుడుగా పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య రంగ ప్రవేశం చేశారు. అయితే ఇంకా ఆట మొదలు కాకుండానే ఆయన కాడి కిందపడేశారు. అక్కడి వారిని ఇక్కడకు, ఇక్కడి వారిని అక్కడకు మారుస్తూ సీఎం జగన్ ప్రయోగాలు చేసినప్పటికీ అవి సత్ఫలితాలు ఇవ్వడం లేదు. పొన్నూరు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కిలారి వెంకటరోశయ్య గుంటూరు ఎంపీ అభ్యర్థిగా రాజకీయ బదిలీపై వచ్చారు. తొలుత ఈ సీటుకు రోశయ్య బావమరిది ఉమ్మారెడ్డి వెంకటరమణను ఎంపిక చేశారు. ఆయన రెండు మూడు రోజుల్లోనే తోక ముడిచి నాకొద్దీ సీటంటూ పరారయ్యారు. దీంతో అవాక్కయిన వైసీపీ అధిష్ఠానం అతనికి బదులుగా , అతని బావ రోశయ్యను బరిలోకి దించారు. అభ్యర్థిగా ఖరారు చేసింది కొద్ది రోజుల క్రితమే అయినప్పటికీ ఆయన అయిష్టంగానే అడుగులు వేస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం అధిష్ఠానం సూచించినంత మొత్తం ఆయన వద్ద లేకపోవడమేనని సమాచారం. ఈ పరిస్థితుల్లో ఆయన బుధవారం తన మామ, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డిలతో కలిసి వెళ్లి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఎదుట తన గోడు వెళ్లగక్కినట్లు తెలిసింది. తాను ఎంపీగా పోటీ చేయలేనని, ఎంపీగా పోటీ చేసే ఆర్థిక స్థితి తనకు లేదని రోశయ్య సజ్జలకు విన్నవించినట్లు తెలిసింది. తన వద్ద ఎమ్మెల్యే ఎన్నికలకు పోటీ చేసేంత ఆర్థిక స్తోమత మాత్రమే ఉందని, అందువల్ల తనకు తాను ప్రాతినిథ్యం వహిస్తున్న పొన్నూరు సీటునే తిరిగి ఇవ్వాలని మొరపెట్టుకున్నట్లు తెలిసింది. అది వీలు కాని పక్షంలో గుంటూరు పశ్చిమ నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరినట్లు సమాచారం. గుంటూరు పశ్చిమలో తన సామాజికవర్గం ఓటర్లు కూడా ఎక్కువగా ఉన్నారని వివరించినట్లు తెలిసింది. చిలకలూరిపేట నుంచి ఇక్కడకు వలస వచ్చిన విడదల రజినీని గుంటూరు ఎంపీగా బరిలోకి దించాలని కూడా రోశయ్య సూచించినట్లు సమాచారం. అయితే ఈ సమయంలో మార్పులు చేయడం అంతసులువు కాదని, ఇప్పుడే తొందరపడి ఎటువంటి ప్రకటనలు చేయవద్దని సజ్జల వారికి హితవు చెప్పినట్లు తెలిసింది. ఉగాది పండుగ వరకు ఆగమని ఆ తర్వాత కొద్దిపాటి మార్పులు, చేర్పులు ఉండే అవకాశం ఉందని చెప్పారు. ఈలోగా సీఎం జగన్‌తో మాట్లాడి ఏ విషయం చెబుతానని రోశయ్యను అనునయించినట్లు తెలిసింది.

# బాధ్యతలు స్వీకరించారు

- గుంటూరు ఐజీగా సర్వ శ్రేష్ఠత్రిపాఠి..
- పల్నాడు ఎస్పీగా బిందుమాధవ్..



గుంటూరు రేంజ్ ఐజీగా బాధ్యతలు స్వీకరిస్తున్న సర్వ శ్రేష్ఠ త్రిపాఠి



పల్నాడు ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న గరికపాటి బిందుమాధవ్

గుంటూరు, నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 4: ఎన్నికల సంఘం ఆదేశాల నేపథ్యంలో గుంటూరు ఐజీ, పల్నాడు ఎస్పీలపై బదిలీ వేటువేసిన వారి స్థానంలో నియమితులైన అధికారులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు రేంజ్ ఐజీగా సర్వశ్రేష్ఠ త్రిపాఠి, పల్నాడు ఎస్పీగా గరికపాటి బిందుమాధవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరు వెంటనే విధుల్లో చేరాల్సిందిగా ఆదేశించగా ఆ ప్రకారం వారు బాధ్యతలు చేపట్టారు. రేంజి ఐజీగా నియమితులైన సర్వ శ్రేష్ఠత్రిపాఠి 2006 బ్యాచ్‌కి చెందిన ఐపీఎస్ అధికారి. ఆయన గతంలో 2016 నుంచి 2018 ఎన్నికల ముందు వరకు గుంటూరు అర్బన్ ఎస్పీగా రెండేళ్లు విధులు నిర్వహించారు. మూడేళ్ల డిప్యూటేషన్ పూర్తి చేసుకుని ఉత్తరప్రదేశ్ నుంచి ఆయన తిరిగి ఏపీకి వచ్చారు. అప్పటి నుంచి ఆయన డీజీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. గత ఏడాది ఆయనకు ఐజీగా ఉద్యోగోన్నతి లభించింది. సర్వశ్రేష్ఠ త్రిపాఠి రేంజ్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయనను గుంటూరు ఎస్పీ తుషార్‌డూడీ, ఏఎస్పీలు, డీఎస్పీలు మర్యాద పూర్వకంగా కలిశారు. శాంతి భద్రతలకు సంబంధించిన వివిధ అంశాలను ఎస్పీ తుషార్ డూడీని అడిగి తెలుసుకున్నారు.

- పల్నాడు ఎస్పీగా నియమితులైన గరికపాటి బిందుమాధవ్ 2017లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. తొలుత ఆయన రంపచోడవరం ఓఎస్‌డీగా విధులు నిర్వహించారు. ఆ తర్వాత ఉమ్మడి గుంటూరు జిల్లా సెబ్ ఏఎస్పీగా పని చేశారు. జిల్లాల విభజన అనంతరం ఆయన పల్నాడు జిల్లా ఓఎస్డీగా, ఏఎస్పీగా పని చేశారు. ఆ తర్వాత ఆయన ఉద్యోగోన్నతి పొంది గ్రేహౌండ్స్ ఎస్పీగా బదిలీపై వెళ్లారు. ఆ తర్వాత తిరిగి తాజాగా పల్నాడు ఎస్పీగా రావడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఆయనకు జిల్లాపై అవగాహన ఉండటం వల్ల రానున్న ఎన్నికల నిర్వహణ కొంత సులువు కానుంది. బిందుమాధవ్ నరసరావుపేటలోని ఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

### ఉమ్మడి గుంటూరు జిల్లాలో పనిచేసిన వారే..

గుంటూరు రేంజిలో తాజాగా నియమితులైన నలుగురు ఐపీఎస్ అధికారుల్లో ముగ్గురు గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో పనిచేసిన వారే కావడం గమనార్హం. ఐజీ సర్వ శ్రేష్ఠత్రిపాఠి 2016 నుంచి 2018 వరకు గుంటూరు అర్బన్ ఎస్పీగా విధులు నిర్వహించారు. పల్నాడు ఎస్పీ గరికపాటి బిందుమాధవ్ ఉమ్మడి గుంటూరు జిల్లా సెబ్ ఏఎస్పీగా పని చేశారు. ఇక నెల్లూరు ఎస్పీగా నియమితులైన ఆరిఫ్‌హఫీజ్ ఉమ్మడి గుంటూరు జిల్లా సెబ్ ఏఎస్పీగా ఏడాదికి పైగా పనిచేశారు. ఆ తర్వాత అర్బన్ ఏఎస్పీగా, గుంటూరు అర్బన్ ఎస్పీగా పని చేశారు. జిల్లాల విభజన తర్వాత గుంటూరు జిల్లా ఎస్పీగా పనిచేశారు. రెండు నెలల క్రితం ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో డీజీపీ కార్యాలయానికి వెళ్లారు. తాజాగా ఆయనను గుంటూరు రేంజి పరిధిలోని నెల్లూరు ఎస్పీగా నియమించారు.

దిక్సూచి DIKSUCHI

# ఇంద్రప్రస్థ ఇన్‌స్టిట్యూట్‌లో పీహెచ్‌డీ

ఢిల్లీలోని ఇంద్రప్రస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐఐఐటీడీ)- పీహెచ్‌డీ 2024(మాన్‌సూన్ సెషన్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రెగ్యులర్, స్పాన్సర్డ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. స్పాన్సర్డ్ ప్రోగ్రామ్‌ను వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేకించారు. వీరు స్పాన్సరింగ్ సర్టిఫికెట్‌ను సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అకడమిక్ మెరిట్, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ (ఎస్‌ఓపీ) ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌కు మాత్రం పీజీక్యాట్ ఎగ్జామ్ ఉంటుంది.

**పరిశోధన విభాగాలు:** కంప్యూటేషనల్ బయాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, సోషల్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్(ఫిలాసఫీ, కమ్యూనికేషన్, గవర్నెన్స్, పాలిటిక్స్), హ్యూమన్ సెంటర్డ్ డిజైన్.

**అర్హత:** అభ్యర్థులు ఎంచుకొన్న విభాగాన్ని అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లతో ఎంఈ/ఎంటెక్/ ఎంఫార్మసీ/ ఎండిజైన్/ ఎంఎస్/ ఎమ్మెస్సీ/ ఎంసీఏ/ ఎంబీబీఎస్/ ఎంస్టాట్/ ఎంఫిల్/ ఎంఏ/ ఎంఎస్‌డబ్ల్యూ/ఎంకాం ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 70 శాతం మార్కులతో బీఈ/బీటెక్/బీఫార్మసీ/బీడిజైన్ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్ఐఆర్/ యూజీసీ/ డీఎస్‌టీ/ ఇన్‌స్పయిర్/ ఐసీఎంఆర్/ డీబీటీ/ ఎన్‌బీహెచ్‌ఎం ఫెలోషిప్ అర్హత తప్పనిసరి. నిర్దేశించిన విభాగాలకు గేట్/ జీప్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

**ఫెలోషిప్:** రెగ్యులర్ ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులందరికీ సంస్థ ఫెలోషిప్‌లు అందిస్తుంది. కాంప్రహెన్సివ్ ఎగ్జామ్ పూర్తయ్యేవరకు నెలకు రూ.37,000; తరవాత పీహెచ్‌డీ పూర్తయ్యేవరకు నెలకు రూ.42,000 ఇస్తారు. ప్రతినెలా హెచ్‌ఆర్‌ఏ చెల్లిస్తారు. ల్యాప్‌టాప్/డెస్క్‌టాప్ కొనుగోలు నిమిత్తం రూ.50,000; కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.20,000 చెల్లిస్తారు. రీసెర్చ్ వర్క్ నిమిత్తం ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లకు హాజరయ్యేందుకుగాను ప్రోగ్రామ్ మొత్తమ్మీద రూ.రెండున్నర లక్షలు ఇస్తారు. మూడు నుంచి ఆర్నెల్లపాటు విదేశాల్లో పరిశోధనలు చేసేందుకు 12000 యూఎస్ డాలర్లు చెల్లిస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.300; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 14
- **ఈసీఈ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు:** ఏప్రిల్ 25, 26; మే 10
- **సీఎస్‌ఈ అభ్యర్థులకు పీజీ క్యాట్ ఎగ్జామ్:** ఏప్రిల్ 28
- **సీఎస్‌ఈ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు:** మే 2, 3
- **మిగిలిన స్పెషలైజేషన్‌లకు రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** మే 1 నుంచి 13 వరకు
- **వెబ్‌సైట్:** www.iiitd.ac.in



# సీఐఎఫ్ఎన్ఈటీలో ట్రేడ్ కోర్సులు

కేంద్ర ఫిషరీస్ విభాగం ఆధ్వర్యంలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ నాటికల్ అండ్ ఇంజనీరింగ్ ట్రెయినింగ్(సీఐఎఫ్ఎన్ఈటీ)- వెసల్ నావిగేటర్ కోర్సు(వీఎన్‌సీ), మెరైన్ ఫిట్టర్ కోర్సు(ఎంఎఫ్‌సీ)లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇవి ట్రేడ్ కోర్సులు. ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. వీటిలో ఫిషింగ్ వెసల్స్‌పై ప్రాక్టికల్ ట్రెయినింగ్ ఉంటుంది. ఎన్‌సీవీటీ క్రాఫ్ట్‌మన్ ట్రెయినింగ్ స్కీం కింద న్యూఢిల్లీలోని డీజీఈటీ, ఈ కోర్సులను నిర్వహిస్తోంది. ఇవి కొచ్చి, చెన్నై, విశాఖపట్నం క్యాంపస్‌లలో అందుబాటులో ఉన్నాయి. ఒక్కో క్యాంపస్‌లో వీఎన్‌సీ 20, ఎంఎఫ్‌సీ 20 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ స్కోర్, కౌన్సెలింగ్‌ల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

**అర్హత:** మేథమెటిక్స్, సైన్స్ ప్రధాన సబ్జెక్టులుగా పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 40 శాతం మార్కులు తప్పనిసరి. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 1 నాటికి 15 నుంచి 20 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు నిబంధనల ప్రకారం వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది.

- వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని నింపి నిర్దేశిత పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.350; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.175
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 14
- **టెస్ట్ సెంటర్లు:** కొచ్చి, చెన్నై, విశాఖపట్నం, కోల్‌కతా
- **కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూన్ 29
- **ఫలితాలు విడుదల:** జూలై 7
- **కౌన్సెలింగ్:** జూలై 18
- **వెబ్‌సైట్:** www.cifnet.gov.in

# జోధ్‌పూర్ ఎయిమ్స్‌లో ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్

జోధ్‌పూర్‌లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్- పబ్లిక్ హెల్త్ పాలసీ, లీడర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ 2024(జూలై సెషన్)ని నిర్వహిస్తోంది. హెల్త్, సోషల్ సర్వీసెస్, ఎడ్యుకేషన్, క్లినికల్ రీసెర్చ్, మెడిసిన్, ఫార్మాస్యూటికల్ విభాగాలకు సంబంధించిన కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలతోపాటు ప్రైవేటు ఆర్గనైజేషన్లలో కనీసం అయిదేళ్ల అనుభవం ఉన్న వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ఈ ప్రోగ్రామ్‌ని ఉద్దేశించారు. ఇందులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. మెడికల్ కేటగిరీకి 8, నాన్ మెడికల్ కేటగిరీకి 7, విదేశీ అభ్యర్థుల కేటగిరీకి 5 సీట్లు కేటాయించారు. కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ఇందులో భాగంగా రెండు కాంటాక్ట్ సెషన్స్(సెషన్‌కు మూడు రోజులు); 23 వారాలపాటు వెబ్ బేస్డ్ లెర్నింగ్, ప్రాజెక్టు వర్క్ ఉంటాయి.

**అర్హత:** మెడికల్ కేటగిరీకి ఎంబీబీఎస్/బీడీఎస్/ఆయుష్ డిగ్రీలు పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. నాన్ మెడికల్ కేటగిరీకి కనీసం 55 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ(నర్సింగ్/వెటర్నరీ సైన్స్/ఫిజియోథెరపీ/ఆక్యుపేషనల్ థెరపీ/ఇంజనీరింగ్) లేదా ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పనిచేస్తున్న సంస్థ నుంచి అనుమతి పత్రం, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్‌లను దరఖాస్తుకు జతచేయాలి.

- **ప్రోగ్రామ్ ఫీజు:** కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రూ.25,000; ప్రైవేట్ ఉద్యోగులకు రూ.1,00,000; విదేశీ అభ్యర్థులకు 1500 యూఎస్ డాలర్లు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 30
- **కోర్సు ప్రారంభం:** జూలై 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.aiimsjodhpur.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/IG4Dkzdలో చదవండి.

# కెరీర్‌లో బిగ్గెస్ట్ యాక్షన్ సీక్వెన్స్



నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'తండేల్'. చందు మొండేటి దర్శకత్వంలో గీతా ఆర్ట్స్ బేనర్‌పై బన్నీవాసు నిర్మిస్తున్నారు. నిర్మాత అల్లు అరవింద్ సమర్పిస్తున్నారు. శ్రీకాకుళం సాగరతీరం నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నాగచైతన్య యాక్షన్ రోల్‌లో అలరించనున్నారు. ఈ చిత్రం తాజా షెడ్యూల్ గురువారం హైదరాబాద్‌లో మొదలైంది. భారీ ఖర్చుతో నిర్మించిన సెట్‌లో పోరాట ఘట్టాలను దర్శకుడు తెరకెక్కిస్తున్నారు. పలువురు ఫైటర్లు పాల్గొంటున్నారు. 'యానిమల్' చిత్రానికి ఫైట్స్ రూపకల్పన చేసిన సుప్రీం సుందర్ సరికొత్తగా పోరాట ఘట్టాలను తీర్చిదిద్దుతున్నారు. యాక్షన్ సీన్లలో నాగచైతన్యను సరికొత్తగా చూపించబోతున్నారు, ఆయన కెరీర్‌లోనే ఇది బిగ్గెస్ట్ యాక్షన్ సీక్వెన్స్ అవుతుందని యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

# ఇదొక ఎక్స్‌ట్రార్డినరీ చిత్రం

నవీన్ యెర్నేని



మలయాళంలో ఘనవిజయం అందుకున్న సర్వైవల్ థ్రిల్లర్ 'మంజుమ్మల్ బాయ్స్'. అక్కడ రూ. 200 కోట్ల రూపాయల వసూళ్లు అందుకుంది. ఈ చిత్రం తెలుగు వెర్షన్‌ను మైత్రీ మూవీ మేకర్స్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. ఈ నెల 6న తెలుగు రాష్ట్రాల్లో విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా దర్శకుడు చిదంబరం మాట్లాడుతూ 'మైత్రీ మూవీ మేకర్స్‌కు నా ధన్యవాదాలు. తెలుగు ప్రేక్షకులు మా 'మంజుమ్మల్ బాయ్స్' చిత్రాన్ని ఆదరించాలి. సరికొత్త వినోదాన్ని పంచే చిత్రమిది' అని అన్నారు నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ 'ఇదొక ఎక్స్‌ట్రార్డినరీ ఫిల్మ్. ఈ మధ్యకాలంలో నేను చూసిన గొప్ప చిత్రం కూడా. తెలుగులోనూ పెద్ద విజయాన్ని సాధిస్తుంది. మన ప్రేక్షకులు తప్పకుండా ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు. యువతను మెప్పించే అన్ని అంశాలూ ఈ చిత్రంలో ఉన్నాయని నటుడు శ్రీనాథ్ భాసి చెప్పారు.

# కీర్తన ప్రేమకథ



చిమటా రమేశ్‌బాబు స్వీయ దర్శకత్వంలో హీరోగా నటిస్తున్న చిత్రం 'నేను-కీర్తన'. రిషిత, మేఘన హీరోయిన్లు. చిమటా లక్ష్మీకుమారి నిర్మాత. ఇటీవలే చిత్రబృందం ఫస్ట్‌లుక్, టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ 'నేను-కీర్తన' కొత్త తరహా చిత్రం. ఈ ఏడాది బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో దీనికి స్థానం దక్కుతుందని భావిస్తున్నా. కులు, మనాలీలో చిత్రీకరించిన పాటలు, రోప్ ఫైట్స్ ఈ చిత్రానికి ప్రత్యేకాకర్షణ' అని తెలిపారు. 'నేను-కీర్తన' చిత్రం ఘన విజయం సాధించాలని దర్శకుడు వీరశంకర్, యాటా సత్యనారాయణ ఆకాంక్షించారు. సంధ్య, జీవా, జబర్దస్త్ అప్పారావు కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: ఎం. ఎల్ రాజా. సినిమాటోగ్రఫీ: కె. రమణ.

# యువరాణి పాత్రలో...



'నన్ను దోచుకుందువటే' చిత్రంతో తెలుగులో అడుగుపెట్టి కుర్రకారు మది దోచేశారు నభా నటేశ్. ఆ తర్వాత వరుస ఆఫర్లతో పలు చిత్రాల్లో నటించిన నభా..ఓ ప్రమాదంలో గాయపడి సినిమాలకు రెండేళ్లు విరామమిచ్చారు. ఇటీవలే కోలుకున్న ఆమె తిరిగి నటించడానికి సిద్ధమయ్యారు. ప్రస్తుతం ఆమె నిఖిల్ సిద్ధార్థ్ పాన్ ఇండియా చిత్రం 'స్వయంభు'లో సెకండ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇందులో నభా ఓ పవర్‌ఫుల్ రోల్‌ను పోషిస్తున్నారు. చిత్రబృందం గురువారం ఆమె పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌ను చూస్తుంటే ఆమె యువరాణి పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. భరత్‌కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నారు. భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది. ఇందులో నిఖిల్ పోరాట యోధుడి పాత్రను పోషిస్తున్నారు. ఈ పాత్ర కోసం ఆయన గుర్రపుస్వారీ, మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకోవడం విశేషం.

# నేను బతికుండగా అంగీకరించను

అతిలోక సుందరి శ్రీదేవిని ప్రేమించి పెళ్లాడారు బోనీకపూర్. దురదృష్టవశాత్తు శ్రీదేవి 2018లో మరణించారు. పలు సందర్భాల్లో ఆమె జ్ఞాపకాలను గుర్తుచేసుకుని భావోద్వేగానికి లోనవుతుంటారు బోనీకపూర్.



ప్రస్తుతం 'మైదాన్' చిత్రం ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న ఆయనను ఓ ఆంగ్ల మీడియా ప్రతినిధి శ్రీదేవి బయోపిక్ ఉంటుందా అని అడగగా, బోనీకపూర్ సమాధానమిచ్చారు. "శ్రీదేవి వ్యక్తిగత స్వేచ్ఛను కోరుకునే వ్యక్తి. బతికున్నంత కాలం ఆమె తన వ్యక్తిగత జీవితంలో జరిగే విషయాలలో ఎంతో గోప్యతను పాటించింది. భర్తగా నేను ఆమె ఆలోచనల్ని గౌరవించాలి. నేను బతికున్నంత వరకూ ఆమె బయోపిక్‌కు అంగీకరించను" అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/1RqKdIQ లో చదవండి.



చిలువూరులో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న గుంటూరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ప్రచారంలో పాల్గొన్న కూటమి నేతలు

## అధికారంలోకి రాగానే యువతకు ఉద్యోగాలు

● గుంటూరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని

దుగ్గిరాల, ఏప్రిల్ 4: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రాగానే లక్షలాదిమంది యువతకు ఉద్యోగాల కల్పనపై దృష్టి సారిస్తామని గుంటూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. మండల గ్రామాలు రేవేంద్రపాడు, శృంగారపురంలో గురువారం ఆయనపర్యటించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని అన్నారు. మండల టీడీపీ అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, తాళ్ల అశోక్, గూడూరు వెంకట్రావు, పుతుంబాక సాయికృష్ణ, కొప్పుల మధుబాబు, సర్పంచ్‌లు పాటిబండ్ల కృష్ణప్రసాద్, వాసిరెడ్డి ప్రదీప్, మాజీసర్పంచ్‌లు వాసిరెడ్డి శ్రీనివాసరావు, మొవ్వా చంద్రశేఖరరావు, ఇంటూరి శ్రీను, యలవర్తి అంకమరావు, మాజీఎంపీటీసీ పెందుర్తి మాధురి, రవికాంత్, మేకా కోటయ్య, జూపల్లి వెంకటేశ్వరరావు, కేసంనేని వాసు, పెమ్మసాని రామకృష్ణ, ఇజ్జగాని శంకర్, వీరశంకర్, రెడ్డి వెంకట్రావు, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండలంలోని చిలువూరు, తుమ్మపూడి గ్రామాల్లో గురువారం పెమ్మసాని ప్రచారం కొనసాగింది. గ్రామాల్లోని ముస్లింలు, ఎస్సీలు పెమ్మసానికి ఎదురేగి, విజయం మనదే అంటూ ఘనస్వాగతం పలుకుతూ, తమవీధులకు తీసుకెళ్లి కుటుంబసభ్యులకు పరిచయం చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో తోటకూర సీతారామయ్య, నర్రా శ్రీనివాసరావు, ఎంపీటీసీలు వాసిరెడ్డి లక్ష్మి, జబీన్, చిలువూరు రోజమరి యమ్మ, మాజీ జడ్పీటీసీ యేళ్ల జయలక్ష్మిలతో పాటు నిజాముద్దీన్, జలాలు ద్దీన్, వహిదుల్లా, పినపాటి కరుణాకర్, జీవన్, గార్డెన్ వెంకటేశ్వరరావు, మండల బీజేపీ అధ్యక్షుడు పసుపులేటి గణేష్, పలువురు బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లింలు పాల్గొన్నారు.

## గుంటూరు మీదగా రెండు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా రెండు ప్రత్యేక రైళ్లను నడిపేందుకు రైల్వే శాఖ నిర్ణయించింది. నెంబరు 02863 హౌరా - యశ్వంత్‌పూర్ ప్రత్యేక రైలు నేడు(శుక్రవారం), ఈ నెల 12వ తేదీన ఉదయం 8.20కి గుంటూరుకు వచ్చి 8.25కి బయలుదేరి అర్ధరాత్రి దాటాక 12.15కి యశ్వంత్‌పూర్ జంక్షన్‌కు చేరుకొంటుంది. ఈ రైలు హౌరా నుంచి గురువారం బయలుదేరుతుంది. నెంబరు. 02864 యశ్వంత్‌పూర్-హౌరా ప్రత్యేక రైలు ఈనెల 6,13 తేదీల్లో ఉదయం 5గంటలకు బయలుదేరి గుంటూరుకు సాయంత్రం 5.25కి వచ్చి 5.30కి బయలుదేరు తుంది. హౌరాకు మరుసటి రోజు మధ్యాహ్నం 1.25కి చేరుతుంది. ఈ రైళ్ల సేవలను వినియోగించుకోవాలని ప్రయాణీకులకు డీఆర్‌ఎం రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

# ఆలపాటి.. జిల్లాకు ఘనాపాటి



ఆలపాటిని దుశ్శాలువాతో సన్మానిస్తున్న గల్లా మాధవి

● మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు కితాబు
● ఘనంగా మాజీ మంత్రి 'ఆలపాటి రాజా' జన్మదిన వేడుకలు
● వేడుకల్లో పాల్గొన్న ఆనందబాబు, పెమ్మసాని, గల్లా మాధవి

గుంటూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఆలపాటి ఈ జిల్లాకు ఘనాపాటి అని టీడీపీ నేతలు కొనియాడారు. మాజీమంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ జన్మదిన వేడుకలు గురువారం గుంటూరు ఇన్నర్ రింగ్‌రోడ్డులోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఆలపాటి పుట్టినరోజు వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో మాజీమంత్రి నక్కా ఆనందబాబు, గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు పశ్చిమ అభ్యర్థి గల్లా మాధవి పాల్గొన్నారు. ఆలపాటికి కేక్, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పార్టీకి ఆయన చేసిన సేవలు, ప్రజా ప్రతినిధిగా, మంత్రిగా ప్రజలకు అందించిన సేవలు మరువలేనివన్నారు. ఆలపాటి రాజా ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, ఉన్నత పదవులు అలంకరించి జిల్లా ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఆలపాటి అభిమానులు, పార్టీ శ్రేణులు పుష్పగుచ్ఛాలు బహుకరించి, దుశ్శాలువాలతో సత్కరించి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెనాలి నుంచి అనుచరులు, పార్టీ కార్యకర్తలు ఆలపాటి ఇంటికివచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు చిట్టాబత్తిన చిట్టిబాబు, మద్దిరాల మ్యాని, రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, చుక్కపల్లి రమేష్, యాగంటి దుర్గారావు, వేములపల్లి శ్రీరామ్‌ప్రసాద్, నూకవరపు బాలాజి, ఎన్‌వీవీఎస్ వరప్రసాద్ (పెద కూరపాడు బుజ్జి), పిడికిటి తిలక్‌బాబు, కుర్రా అప్పారావు, వెన్నా సాంబశివారెడ్డి, శాకమూరి నారాయణ ప్రసాద్, పంచుమర్తి భూపతిరావు, కార్పొరేటర్లు పోతురాజు సమత, కొమ్మినేని కోటేశ్వరరావు, మానం పద్మశ్రీ తదితరులు ఆలపాటికి శుభాకాంక్షలు తెలిపారు.



ఆలపాటికి మిఠాయి తినిపిస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

## జిల్లా జడ్జిల బదిలీలు

గుంటూరు(లీగల్), ఏప్రిల్ 4: రాష్ట్రవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో పనిచేస్తున్న 30 మంది జిల్లా జడ్జిలను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు విజిలెన్స్ రిజిస్ట్రార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. గుంటూరుజిల్లా, గుంటూరులో మూడో అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న జి.అర్చనను తిరుపతిలోని నాలుగో అదనపు జిల్లాకోర్టు (ఎస్సీ ఎస్టీ కోర్టు)కు బదిలీ చేశారు. గుంటూరులో ఫ్యామిలీ కోర్టు (12వ అదనపు జిల్లా కోర్టు)లో అదనపు జిల్లాజడ్జిగా పనిచేస్తున్న వీవీఎస్ సూర్యనారాయణమూర్తిని రాజమండ్రిలోని ఏసీబీ కోర్టుకు స్పెషల్ జడ్జిగా బదిలీచేశారు. ఆయన స్థానంలో ప్రస్తుతం రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ, మంగళగిరిలో అడిషనల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న జి.చక్రపాణి ని నియమించారు. గురజాలలో అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న జి. వెంకటేశ్వర్లు మచిలీపట్నంలోని పోక్సో కోర్టుకు స్పెషల్ జడ్జిగా బదిలీ చేశారు. గతంలో నెల్లూరులో ఆరవ అదనపు జిల్లాజడ్జిగా పనిచేసిన ఎస్.సత్యశ్రీని తిరిగి విధుల్లోకి తీసుకొని నరసరావు పేటలో ఖాళీగా ఉన్న 13వ అదనపు జిల్లా కోర్టుకు బదిలీ చేశారు. అనంత పురం ఎస్సీ ఎస్టీ కోర్టులో స్పెషల్ జడ్జిగా పనిచేసిన డి.శ్రీనివాసులును తిరిగి విధు ల్లోకి తీసుకొని తెనాలిలో ఖాళీగావున్న 11వ జిల్లా కోర్టుకు బదిలీ చేశారు. బదిలీ అయిన జడ్జిలు ఈనెల 24లోగా వారి కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించారు.

## ద్విచకవాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

తాడికొండ, ఏప్రిల్ 4: రేషన్ బియ్యం కోసం వెళ్లిన ఆ వృద్ధురాలిని ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో మృతి చెందిన ఘటన గురువారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు తాడికొండ మండలం మోతడక గ్రామానికి చెందిన పెనుమచ్చు అంజమ్మ(80) రేషన్ బియ్యం తెచ్చుకోవటానికి ఎండీయూ వాహనం వద్దకు వెళ్లింది. బియ్యం తీసుకోని ఇంటికివస్తున్న క్రమంలో రోడ్డు దాటుతుండగా అమరావతి నుంచి గుంటూరు వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధురాలి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారంతో ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ద్విచక్రవాహన దారుడికి గాయాల వ్వటంతో ఆస్పత్రికి వెళ్లాడు. ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.



కుమారుడు మృతదేహం వద్ద రోధిస్తున్న తల్లిదండ్రులు

## మెడకు చీర బిగించుకొని బాలుడి మృతి

గురజాలటౌన్, ఏప్రిల్ 4: ఇంటి ముందు వేపచెట్టు కింద ఆటాడుకుంటూ ప్రమాదవశాత్తూ చీర మెడకు బిగుసుకోవడంతో బాలుడు మృతిచెందిన సంఘటన మండలంలోని దైదలో జరిగింది. గ్రామానికి చెందిన కొలిపాకుల శ్రీను, శివలక్ష్మి దంపతులు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం కూడా వ్యవసాయ పనులు నిమిత్తం వారు పొలానికి వెళ్లగా వారి కుమారుడు నారాయణ (13) ఇంటి ముందు ఉన్న వేపచెట్టుకు చీరతో ఉయ్యాల కట్టుకొని ఆడుకుంటున్నాడు. ప్రమాదవశాత్తూ చీర గొంతుకు బిగిసుకోవడంతో ఊపిరాడక మృతిచెందారు. కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగారు.

## నీటి తొట్టెలో పడి చిన్నారి మృతి

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 4: ప్రమాదవశాత్తూ నీటి తొట్టెలో పడి మూడేళ్ళ చిన్నారి మృతి చెందిన విషాద ఘటన పట్టణంలోని జరిగింది. స్థానికల వివరాల ప్రకారం.. పట్టణంలోని యడ్ల లింగయ్య కాలనీ శివారు పొలాల వద్ద బుధవారం రాత్రి ఓ కుటుంబానికి చెందిన చిన్నారి ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ నీటి తొట్టెలో పడింది. ఆలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తీసుకురాగా అప్పటికే చిన్నారి మృతి వైద్యులు చెప్పినట్లు సమాచారం. ఈ ఘటనపై త్రీటౌన్ పోలీసులను వివరణ కోరగా చిన్నారి మృతిపై తమకు ఎటువంటి సమాచారం లేదని తెలిపారు.

## పాత కక్షల నేపథ్యంలో గొడ్డలితో దాడి



ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న పెద్దిరాజు

వెల్దుర్తి, ఏప్రిల్ 4: పొలం పనులు ముగించుకొని బైకుపై ఇంటికి వస్తున్న ఓ వ్యక్తిపై ప్రత్యర్థులు దాడి చేసిన ఘటన మండలంలోని కండ్లకుంటలో గురువారం జరిగింది. మండలంలోని కొత్తపుల్లారెడ్డిగూడెంకు చెందిన గన్నెబోయిన గంగిరాజు 2020 సంవత్సరంలో ప్రత్యర్థుల చేతిలో హత్యకు గురయ్యారు. రెండేళ్ల తరువాత ఆ ప్రత్యర్థులు తిరిగి తమ స్వగ్రామమైన కొత్త పుల్లారెడ్డిగూడెంకు చేరారు. గంగిరాజు సోదరులైన లక్ష్మయ్య, శ్రీరాములు, పెద్దిరాజు, శివయ్య, శ్రీనులు కండ్లకుంటలో జీవిస్తున్నారు. కండ్లకుంటలోనే పొలాన్ని కౌలుకు తీసుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం పెద్దిరాజు పొలం పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా మార్గ మధ్యంలోని గ్రామ శివారులో గల శ్మశాన వాటిక వద్ద ప్రత్యర్థులు కాపుకాచి దాడికి తెగబడ్డారు. గొడ్డళ్లతో తల, చేతులపై నరికారు. పెద్దిరాజు గట్టిగా కేకలు వేయడంతో గ్రామస్తులు అక్కడకు చేరుకుంటుండడాన్ని గమనించి దాడికి పాల్పడిన వారంతా అక్కడి నుంచి పారిపోయారు. గాయపడిన పెద్దిరాజును మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తనపై తన సోదరుడు గంగిరాజు హత్యకేసులో నిందితుడైన కొమ్ము నానితోపాటు శ్రీను, వేమరాజుతోపాటు మరికొందరు దాడిచేశారని పెద్దిరాజు తెలిపారు.

## టీడీపీ నేతపై వైసీపీ కార్యకర్తల దాడి

సత్తెనపల్లి, ఏప్రిల్ 4: మండలంలోని ధూళ్ళిపాళ్ళ గ్రామంలో టీడీపీ నాయకుడు బండారుపల్లి నాగేశ్వరరావుపై బుధవారం రాత్రి వైసీపీ కార్యకర్తలు దాడిచేశారు. నాగేశ్వరరావు వైసీపీ నుంచి ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరారు. రాత్రి నాగేశ్వరరావు తన వాహనంపై ఇంటికి వెళ్తుండగా నాగేశ్వరరావు వాహనాన్ని వైసీపీ కార్యకర్తలు అడ్డుకొని టీడీపీ అభ్యర్థి కన్నాను గ్రామంలోకి ఆహ్వానిస్తారా? అని దుర్భాషలాడుతూ దాడిచేశారు. సమాచారం అందుకున్న నాగేశ్వరరావు వర్గీయులు అక్కడకు చేరుకోవటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు గ్రామానికి వెళ్లి ఇరువర్గాలను చెదరగొట్టారు. ముందు జాగ్రత్తగా గ్రామంలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

## వడదెబ్బకు వృద్ధురాలి మృతి

పొన్నూరుటౌన్, ఏప్రిల్4: వేసవి ఎండల తీవ్రత పెరగటంతో వడదెబ్బకు గురై వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని కసుకర్రు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. కసుకర్రు గ్రామానికి చెందిన నాగిశెట్టి మస్తానమ్మ(85) మస్తానమ్మ ఈ నెల 2న వడదెబ్బతో తీవ్ర అస్వస్థకు గురై గుంటూరు జీజీహెచ్‌లో చేరగా, చికిత్స పొందుతూ మృతి చెందిన్నట్లు బంధువులు వెల్లడించారు.

## వైసీపీకి మాజీ కౌన్సిలర్ రాజీనామా

సత్తెనపల్లి, ఏప్రిల్ 4: పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ వైసీపీ నేత బచ్చు మనోహర్ వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు గురువారం తెలిపారు. ఆయన భార్య వరలక్ష్మి మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఆమె కూడా డైరెక్టర్ పదవికి రాజీనామా చేస్తూ యార్డు కార్యదర్శి ఇస్మాయిల్‌కు రాజీనామా పత్రాన్ని అందించారు. సీనియర్ కౌన్సిలర్ అయిన మనోహర్ టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరేందుకే వైసీపీకి రాజీనామా చేసినట్టు తెలుస్తుంది. ఇప్పటికే మనోహర్ కన్నాను కలసి టీడీపీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేశారు.

## బస్సు ఢీకొని చిరు వ్యాపారి మృతి

నాదెండ్ల, ఏప్రిల్ 4: మండలంలోని సాతులూరు గ్రామ పరిధిలో గల గుంటూరు-కర్నూలు రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫిరంగిపురం గ్రామానికి చెందిన వడిసె బాల చిన్నారావు(58) అనే చిరు వ్యాపారి మృతి చెందాడు. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం బాలచిన్నారావు ఇంటిలో కొవ్వొత్తులు తయారు చేసిషాపుల్లో అమ్ముకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. బాల చిన్నారావు నరసరావుపేటలో షాపులకు కొవ్వొత్తులను అమ్మేందుకు స్కూటీపై బయలుదేరాడు. సాతులూరు గ్రామ పరిధిలోని బయ్యన రైస్ మిల్లు సమీపంలోకి వచ్చేటప్పటికీ నరసరావుపేట నుంచి గుంటూరు వెళ్ళే ఆర్టీసీ బస్సు స్కూటీని ఢీకొట్టింది. ఈ ఘటనలో బాలచిన్నారావు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ బలరామి రెడ్డి సందర్శించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## క్రైస్తవులపై కృతజ్ఞత లేని జగన్‌రెడ్డి

● జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ జోసఫ్ మోసిగంటి



పొన్నూరుటౌన్, ఏప్రిల్ 2: ఓట్లేసి గెలిపించిన క్రైస్తవులపై జగన్‌రెడ్డికి కృతజ్ఞత లేదని క్రైస్తవులను మైనార్టీలుగా గుర్తించకపోవటమే ఇందుకు నిదర్శనమని జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్, సెయింట్ మేరీస్ కళాశాల మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ జోసఫ్ మోసిగంటి గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రాజ్యాంగం క్రైస్తవులను మైనార్టీలుగా గుర్తిస్తే జగన్‌రెడ్డి మాత్రం రాష్ట్రంలో మైనార్టీలుగా గుర్తించలేదని ఆరోపించారు. షెడ్యూలు కులాల వారికి నామినేటెడ్ పదవులు ఇచ్చి క్రైస్తవ మైనార్టీలకు ఇచ్చారని చెబుతున్నారని విమర్శించారు. 18 ఎమ్మెల్సీల అభ్యర్థులను నియమిస్తూ నా ఎస్సీ, నాబీసీలు, నా మైనార్టీలకు సమన్యాయం చేస్తానని జగన్‌రెడ్డి మాట్లాడారన్నారు. ఆ పదవులో ముస్లింలు లేరన్నారు. క్రైస్తవ పేర్లు ఉన్నవారు ఉన్నారు కానీ వారు క్రైస్తవులుగా డిక్లేర్ చేసుకోలేదని వాపోయారు. 48 ఎమ్మెల్సీలో నాలుగు ముస్లింలకు ఇచ్చారన్నారు. 11 రాజ్యసభ స్థానాల్లో 5 స్థానాలు రెడ్డి సామాజిక వర్గానికి ఇచ్చి ఒక స్థానం కూడా క్రైస్తవులకు ఇవ్వలేదని ఆరోపించారు. జగన్ పార్టీకి 98 శాతం ఓట్లేసిన క్రైస్తవులను మోసం చేసారని ఆరోపించారు. వీటిని క్రైస్తవ సమాజం గుర్తించి ఎవ్వరికి ఓటు వేయాలో నిర్ణయం తీసుకోవాలని డాక్టర్ జోసఫ్ మోసిగంటి విజ్ఞప్తి చేశారు.

## ఆంధ్రుల ఆత్మ గౌరవం అమరావతి

● రాజధాని ప్రాంత రైతులు, మహిళలు
● 1570వ రోజుకు చేరుకున్న దీక్షలు, ఆందోళనలు

తుళ్ళూరు ఏప్రిల్ 4: రాష్ట్ర రాజధాని అమరావతిని విస్మరించిన వైసీపీని ఎన్నికల్లో తిరస్కరించాలని 33వేల ఎకరాల భూమిని త్యాగం చేసిన రైతులు అన్నారు. అమరావతి, జై ఆంధ్రప్రదేశ్, మూడు రాజధానులు వద్దు అమరావతి అభివృద్ధిని కొనసాగించాలని రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు గురువారం నాటికి 1570వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ధర్నా శిబిరాలు ఇళ్ల వద్ద దీక్షలు చేస్తున్న పలువురు రైతులు, మహిళలు మాట్లాడారు. మూడు రాజధానులు కావాలని ఎవరూ అడగలేదన్నారు. అమరావతిని చంపేయాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌రెడ్డి మూడు ముక్కలాటకు తీశారన్నారు. ఇపటికైనా మించిపోయింది లేదు.. అమరావతిని రాష్ట్ర ఏకైక రాజధానిగా జగన్‌రెడ్డి ప్రకటించి చిత్తశుద్ధిని చాటుకోవాలని హితవు పలికారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. మూడు రాజధానులకు వ్యతిరేకంగా రాజధాని ప్రాంత 29 గ్రామాలలో రైతుల, మహిళల నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి.




వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు



హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న బాష్యం ప్రవీణ్, ఎమ్మెల్సీ చిరంజీవిరావు

## 6న క్రోసూరులో చంద్రబాబు 'ప్రజాగళం'

● వేలాదిగా తరలి రావాలని భాష్యం ప్రవీణ్ పిలుపు

క్రోసూరు, ఏప్రిల్ 4: క్రోసూరులో ఈ నెల6వ తేదీని ప్రజాగళంలో భాగంగా చంద్రబాబు పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం హెలిప్యాడ్ స్థలాన్ని, బహిరంగ సభా స్థలాన్ని టీడీపీ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్, ఎమ్మెల్సీ చిరంజీవిరావు గురువారం పరిశీలించారు. క్రోసూరులోని పశువుల ఆస్పత్రి వెనుక ఉన్న ఖాళీ స్థలాన్ని హెలిప్యాడ్ ఏర్పాటు కోసం నిర్ణయించారు. బహిరంగ సభ వేదిక స్థలాన్ని అందుకూరు సెంటర్‌లో నిర్వహించే విధంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. సభకు ప్రజలు వేలాదిగా తరలి రావాలని బాష్యం ప్రవీణ్ పిలుపునిచ్చారు. వారివెంట మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాండ్రుకాశయ్య, టీడీపీ నేతలు అనుముల కోటిరెడ్డి, రాయపాటి అమృతరావు, వాసిరెడ్డి అనీల్, నలజాల కోటేశ్వరరావు, దుద్దుల యోహోన్, తోకా వెంకటరావు, పలువురు నాయకులు ఉన్నారు.



బండారుపల్లి చెరువులో మట్టిని తవ్వుతున్న జేసీబీ

## తాగునీటి చెరువులో మట్టి తవ్వకాలు

● రెండేళ్ల క్రితం తీసుకున్న అనుమతులతో అక్రమంగా తవ్వకాలు
● రెండు చెరువుల్లో నీళ్లు లేకపోవటంతో యథేచ్ఛగా మట్టి స్వాహా
● అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న గ్రామ వీఆర్‌వో

తాడికొండ, ఏప్రిల్ 4: గ్రామస్థుల నీటి సమస్యను పట్టించుకోకుండా...తన అక్రమార్జనే ధ్యేయంగా మంచినీటి చెరువులో అక్రమ మట్టి తవ్వకాలకు తెరతీసారు ఓ వైసీపీ నాయకుడు. రెండు సంవత్సరాల క్రితం తీసుకున్న పర్మిషన్లను చూపించి గత పది రోజులుగా అక్రమ మట్టి తవ్వకాలు చేస్తున్నారు. గ్రామంలోని రెండు చెరువులను ఎండబెట్టి మరి మట్టి తవ్వకాలు చేస్తునే ఉన్నారు. రెండు చెరువులు ఎండిపోవటంతో నీళ్ల కోసం గ్రామస్థులు, పశువులు దాహం కేకలు వేస్తున్నారు. అక్రమంగా తవ్వకాలు చేసిన మట్టిని బండారుపల్లి-మండపాడు గ్రామాల మధ్య వేస్తున్న రోడ్డు నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌కు విక్రయించి జేబులు నింపుకున్నారు. గ్రామ అవసరాల నేపంతో ట్రక్కు మట్టిని రూ. 1000లకు, పెద్ద టిప్పర్ రూ. 4 వేల నుంచి రూ. 5 వేల వరకు విక్రయించారు. అంతటితో ఆగకుండా చెరువులకు త్వరలో నీళ్లు వస్తాయని గ్రామస్థులకు చెప్పి మట్టిని పక్కనే ఉన్న పొలంలో డంప్ చేస్తున్నారు. రాబోయే రోజుల్లో మట్టి అవసరం ఉంటే డంప్ చేసిన దగ్గర నుంచి తీసుకువెళ్తారు. రెండు లారీలను పెట్టి మట్టిని పొలంలోకి డంపు చేస్తున్నారు. గడిచిన ఈ 20 సంవత్సరాల్లో తాగునీటి సమస్య లేని గ్రామంగాలో ఇప్పుడు చెరువుల్లో నీళ్లు లేకపోవటంతో బోరు కూడా ఎండిపోయి తాగునీటి సమస్య తీవ్రతరం అయింది. అయితే తన కళ్ల ముందే చెరువుల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్న గ్రామ వీఆర్‌వో, పంచాయతీ కార్యదర్శులు తవ్వకాలకు కొమ్ముకాస్తున్నారు. మట్టి తవ్వకాలకు పర్మిషన్లు ఉన్నాయని స్థానిక వీఆర్‌వోను వివరణ అడుగగా పొంతనలేని సమాధానాలు చెప్పి అక్రమ మట్టి తవ్వకాలకు మద్దతు ఇస్తున్నారు.



తవ్వకాలు జరిపిన మట్టిని పొలంలో దంపు చేసిన దృశ్యం

జిల్లాలో మైనింగ్, మట్టి, ఇసుక తవ్వకాలకు పక్కా పర్మిషన్లు ఉన్న వారికి ఏఎంఆర్ ప్రైవేటు కంపెనీ బిల్లులు మంజూరు చేస్తుంది. సదరు బిల్లులు లారీ, ట్రాక్టర్ ట్రాన్స్‌పోర్టుకు మాత్రమే బిల్లులు వర్తిస్తాయి. కాని ఇక్కడ ఆ బిల్లులను చూపించి పర్మిషన్లు ఉన్నాయని అందరిని నమ్మిస్తున్నారు. గ్రామ వీఆర్‌వో కూడా ట్రాన్స్‌పోర్టు బిల్లులను ఉన్నాయని ఆవే పర్మిషన్లు అని చెప్తున్నారు. అక్రమ మట్టి తవ్వకాలపై డిప్యూటి తహసీల్దార్ కాకుమాను ప్రసాద్‌ను వివరణ అడుగగా మట్టి తవ్వకాలకు ఎలాంటి పర్మిషన్లు ఇవ్వలేదని పేర్కొన్నారు. అక్రమ మట్టి తవ్వకాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కారంపూడి పట్టణానికి చెందిన 50 మంది వలంటీర్లు తమ విధులకు రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం రాజీనామా పత్రాలను ఎంపీడీవో శ్రీనివాసరెడ్డికి అందించారు. - కారంపూడి

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.03 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 142, 151, 162 |
| చికెన్ విత్ స్కిన్ | 274.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 284.00 |

## 1,15,532 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,10,019 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,15,532 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 80,090 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|
| నాన్ ఏసీ కామన్ వెరైటీ | | |
| 334 | 8500 | 19000 |
| నెంబరు. 5 | 9000 | 16000 |
| 273 | 8000 | 16000 |
| 341 | 9000 | 16500 |
| 4884 | 10500 | 16000 |
| సూపర్ 10 | 9000 | 12800 |
| నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ | | |
| తేజ | 8000 | 20500 |
| బ్యాడిగి | 9000 | 15000 |
| దేవనూరు డీలక్స్ | 8000 | 16500 |
| తెల్లకాయలు | 5000 | 11000 |

# పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు





ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న బ్రహ్మారెడ్డి

## మాచర్లలో రౌడీయిజం రాజ్యమేలుతోంది

● కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి

మాచర్లటౌన్, ఏప్రిల్ 4: మాచర్లలో రౌడీయిజం రాజ్యమేలుతోందని మాచర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి జూలకంటి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలోని కొత్తూరు, పశువేముల గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ఒక్క అవకాశమంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. శవ రాజకీయాలు చేయడంలో ఆరితేరిపోయాడని విమర్శించారు. పీఆర్కేను ఈసారి గెలిపిస్తే మాచర్లలో అభివృద్ధి శూన్యమన్నారు. తనకు ఒక్క అవకాశం కల్పిస్తే అందరికీ అండగా ఉంటానని అన్నారు. కార్యక్రమంలో మద్దిగపు వెంకట్రామిరెడ్డి, పెద వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వీరాస్వామి యాదవ్, దోసపాటి అంజయ్య, నాగేశ్వరరావు, బాబు, రూప్లానాయక్, వెంకటేశ్వర్లు నాయక్, బండారుపల్లి సందీప్, రవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**మాచర్ల రూరల్:** పట్టణంలోని పాతూరులో ముస్లింలు గురువారం నిర్వహించిన ఇఫ్తార్ విందుకు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి హాజరయ్యారు ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో బాబుఖాన్, యెనుముల కేశవరెడ్డి, కొమెర దుర్గారావు, నాగూర్‌బాషా, జానీ బాషా, సుభాని, జనసేన అధికార ప్రతినిధి నక్షత్రపు ప్రసాద్, గురవారెడ్డి, మైనార్టీ రాష్ట్ర నేత అన్వర్‌బాషా, నియోజకవర్గ అధ్యక్షుడు నాగూర్‌బాషా, మైనా, మదార్‌సాహెబ్, కరిముల్లా, అల్లాభక్షు పాల్గొన్నారు.

**వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు..**

మాచర్ల పట్టణంలోని వైసీపీకి చెందిన 15 ముస్లిం మైనార్టీ కుటుంబాలు గురువారం ఆ పార్టీని వీడి టీడీపీలో చేరాయి. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని జూలకంటి బ్రహ్మారెడ్డి నివాసంలో వీరంతా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బ్రహ్మారెడ్డి వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఖాసీం, కరిముల్లా, బాజీ, ఫయాజ్, సుభాని తదితరులు ఉన్నారు.

## నిత్యం ప్రజల కోసం పనిచేస్తాం

● కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి సతీమణి శోభారాణి

రెంటచింతల, ఏప్రిల్ 4: ప్రతి నిత్యం ప్రజల కోసం పనిచేస్తామని, ఓటర్లంతా ఆశీర్వదించి ఆదరించాలని, కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి సతీమణి శోభారాణి అన్నారు. బుధవారం స్థానిక అంజనేయస్వామి మాన్యం కాలనీలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. సూపర్ 6 పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మారాజు శ్రీను, సిద్ధయ్య, రామయ్య, రంగాచారి, బుజ్జి, జనసేన నేత కోటేశ్వరరావు, టౌన్ అధ్యక్షుడు రాజారెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్, బోడపాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం

● బాబు ష్యూరిటీ.. ప్రచారంలో కూటమి నేతలు

దుర్గి, ఏప్రిల్ 4: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిని, నరసరవుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలుని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని కూటమి నేతలు అన్నారు. దుర్గిలోని ముటుకూరు రోడ్డులో గురువారం బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. సూపర్-6 పథకాలను ఇంటింటికి తిరిగి వివరించారు. కార్యక్రమంలో సూరె వెంకటేశ్వర్లు, ఆకుల చిన చెన్నయ్య, కోపూరి రామచంద్రయ్య, తోటకూర వెంకటనరసయ్య, యెనుముల నాగేశ్వరరావు, బుగ్గమల్లయ్య, నాగేశ్వరరావు, సుంకర బాల తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మారెడ్డి గెలుపుతోనే అభివృద్ధి సాధ్యం

వెల్దుర్తి, ఏప్రిల్ 4: కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి గెలుపుతోనే మాచర్ల నియోజకవర్గంలో అభివృద్ధి సాధ్యమవుతుందని తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, బ్రహ్మారెడ్డి తనయుడు గౌతమ్‌రెడ్డిలు అన్నారు. మండలంలోని హనుమాపురంతండాలో గురువారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మేనిఫేస్టోలోని సూపర్ 6 పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వులుసు శివారెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు వజ్రం నాయక్, మల్లయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ లీకై పూరిళ్లు దగ్ధం

గురజాలటౌన్, ఏప్రిల్ 4: ప్రమాదవశాత్తూ వంట గ్యాస్ లీకై రెండు పూరి గూడిసెలు దగ్ధమైన సంఘటన మండలంలోని మాడుగుల పంచాయతీ రామాపురం క్యాంపులో గురువారం జరిగింది. క్యాంపునకు చెందిన వట్టిప్రోలు శేషగిరి గృహంలో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తూ వంట గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లోని వారంతా బయటకు వచ్చారు. మంటలు పూర్తిగా చెలరేగి పక్కనే ఉన్న గుబ్బల రాంబాబు పూరి గుడిసెకు కూడా అంటుకున్నాయి. దీంతో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. సుమారు రూ. 10 లక్షల ఆస్థి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

## వడ్డెరలకు క్వారీలు కేటాయించాలి

సత్తెనపల్లి ఏప్రియల్ 4: రాష్ట్రంలోని వడ్డెరలకు జనాబా దామాషా ప్రకారం క్వారీలు కేటాయించాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు, వడ్డెర సంఘం నేత బత్తుల వెంకట స్వామి కోరారు. గురువారం సాయంత్రం టీడీపీ ప్రజావేదికలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వడ్డెరలకు క్వారీలలో ఉన్న హక్కులను వైసీపీ నేతలు గుంజుకొని వడ్డెరల జీవనబృతిపై దెబ్బకొట్టారన్నారు. వడ్డెర కుల వృత్తికి సంబందించిన రోడ్డు రోలర్, జేసీబీ, ట్రాక్టర్ వంటి వాటిని ఇవ్వకుండా చేశారన్నారు. వడ్డెర కార్పొరేషన్ ద్వారా వడ్డెర్లకు జరిగిన మేలు ఏమీ లేదన్నారు. వడ్డెరలకు అన్యాయం చేసిన వైసీపీని రానున్న ఎన్నికలలో ఓడిస్తామన్నారు. సమావేశంలో టీడీపీ వడ్డెర సంఘం నాయకులు ఓర్సు శ్రీహరి కొమెర శ్రీనివాసరావు, కొమెర శంకర్, చల్లా శ్రీనివాసరావు, కొమెర నాగేశ్వరరావు, బత్తుల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



యరపతినేని సమక్షంలో టీడీపీలో చేరిన సింగరాయపాలెంతండా వాసులు

## టీడీపీలోకి భారీగా చేరికలు

● టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించిన యరపతినేని

దాచేపల్లి, ఏప్రిల్ 4: దాచేపల్లి నగరపంచాయతీ పరిధిలోని ఇరికేపల్లి గ్రామానికి చెందిన రెడ్డి సామాజికవర్గానికి చెందిన 20 కుటుంబాలు యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. గురువారం పిడుగురాళ్లలోని పార్టీ కార్యాలయంలో ఇరికేపల్లి గ్రామానికి చెందిన వారితో పాటు మరికొంత మంది ముదిరాజ్‌లు, అలాగే నారాయణపురంలోని వడియ రాజులు 70 కుటుంబాల వారు యరపతినేని సమక్షంలో టీడీపీలో చేరారు.

**పిడుగురాళ్ల :** మాచవరం మండలం సింగరాయ పాలెం తండాకు చెందిన 10 సుగాలీ కుటుంబాలు యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో గురు వారం టీడీపీలో చేశారు. అలాగే పిడుగురాళ్లకు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ నూతి నారాయణ, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త సాంబశివరావు టీడీపీలో చేరగా యరపతినేని వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

**శివాలయంలో యరపతినేని పూజలు ..** స్థానిక శివాలయంలో యరపతినేని శ్రీనివాసరావు పూజలు నిర్వ హించారు. పల్నాడుజిల్లా ప్రజలందరూ క్షేమంగా ఉండాలని యరపతినేని ఆకాంక్షించారు.

**పట్టణంలో నిఖిల్ ప్రచారం ..** జానపాడురోడ్డులోని ఆక్స్‌ఫర్డ్ ప్రాంతంలో వున్న అపార్ట్‌మెంట్‌లలో బుధ, గురువారాలలో గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని తనయుడు నిఖిల్ సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. యరపతినేనిని, లావు శ్రీకృష్ణదేవరాయలును గెలిపించాలని కోరారు.



## కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

● పెదకూరపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్
● టీడీపీ మైనార్టీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం
● అచ్చంపేట మండలంలో టీడీపీలోకి చేరికలు..



ముస్లింలతో కలసి ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్న భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, ఏప్రిల్ 4: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు అని పెదకూరపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం పెదకూరపాడులో టీడీపీ మైనార్టీల కార్యాలయాన్ని ప్రవీణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం ప్రవీణ్ మాట్లాడుతూ.. ముస్లింలకు ఏదైనా అభివృద్ధి జరిగిందంటే అది టీడీపీ ప్రభుత్వంలో మాత్రమేనన్నారు. రాష్ట్రంలో అరాచక, నియంతృత్వ పాలనకు చరమగీతం పలికేందుకు సైకిల్‌గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనను, ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, జనసేన మండల అధ్యక్షుడు మల్లెల వెంకట చలపతిరావు పాల్గొన్నారు. అనంతరం లింగంగుంట్ల గ్రామంలో బాప్టిస్ట్ చర్చి ప్రారంభోత్సవలో ప్రవీణ్ పాల్గొన్నారు.

**ప్రజాగళం సభను విజయవంతం చేయాలి**

ఈనెల 6వ తేదీ మండల కేంద్రమైన క్రోసూరులో జరిగే ప్రజాగళం సభకు టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని భాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం పెదకూరపాడులో ఆయన మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ శుక్రవారం సాయంత్రం 4 గంటలకు 2000 మందితో వేల్పూరు ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుంచి క్రోసూరులోని ఎన్టీఆర్ విగ్రహం వరకు సంఘీభావ ద్విచక్రవాహన ర్యాలీ జరుగుతుందని అన్నారు. ఈ ర్యాలీలో నియోజక వర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

**వైసీపీ నేతలు టీడీపీలో చేరిక..**

పెదకూరపాడుకు చెందిన వైసీపీ నేత కరణం వసంతరావు, వడ్లమూడి సాంబశివరావు, పసుపులేటి శ్రీనులు టీడీపీలో చేరారు. వీరికి గురువారం పెదకూరపాడులో నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి బాష్యం ప్రవీణ్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ అన్నారు.

**అచ్చంపేట:** మండలంలోని చెరుకుంపాలెం గ్రామానికి చెందిన ఉప్పు సుబ్బారావు గురువారం టీడీపీలో చేరారు. క్రోసూరులోని టీడీపీ కార్యాలయంలో పార్టీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సుబ్బారావుకు పార్టీ కండువా కప్పు ఆహ్వానించారు. కార్యక్రమంలో చెరుకుంపాలెం టీడీపీ నేతలు పోట్ల శ్రీనివాసరావు, మొక్కపాటి గిరిబాబు, నల్లమేకల వెంకటేశ్వర్లు, సుంకర బుజ్జిబాబు, చినసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

**కస్తల ప్రజల కష్టాలు తీరుస్తాం ..**

కస్తల గ్రామ ప్రజల కష్టాలను తీరుస్తానని భాష్యం ప్రవీణ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కస్తలలో పర్యటించిన భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ఏర్పడేది కూటమి ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. టీడీపీలో ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందన్నారు. సూపర్ 6 పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**క్రోసూరు :** టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఈనెల 6వ తేదీన పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరులో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు హెలికాప్టర్‌లో క్రోసూరు చేరుకొని, అక్కడనుంచి ప్రత్యేక వాహనాల్లో అందుకూరు వెళ్లి రోడ్‌షోలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారన్నారు. అనంతరం రోడ్ షో ద్వారా సత్తెనపల్లి వెళ్తారన్నారు. చంద్రబాబు పర్యటన నేపథ్యంలో గురువారం క్రోసూరులో ఐదు మండలాల టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఐదు మండలాల నుంచి వేలాదిగా ప్రజలను బహిరంగ సభ వద్దకు తరలించాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు.



ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరిన ఉప్పు సుబ్బారావు, తదితరులు

## వైసీపీ కుట్రలు తిప్పికొట్టండి

● ఈద్గా నిర్మాణానికి ఎకరం ఇస్తా
● ముస్లింలను ఆదుకుంది టీడీపీయే
● ఇఫ్తార్‌లో పాల్గొన్న యరపతినేని..



ఇఫ్తార్ కార్యక్రమంలో మాట్లాడుతున్న యరపతినేని శ్రీనివాసరావు

మాచవరం, ఏప్రిల్ 4: వైసీపీ అభ్యర్థులు కుట్రలు చేసి అక్రమంగా గెలుపొందాలని చూస్తున్నారని, అలాంటి వాటిని టీడీపీ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని తురకపాలెం గ్రామంలో యరపతినేని ఆధ్వర్యంలో రంజాన్‌మాసం సందర్భంగా భారీస్థాయిలో ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ముందుగా మసీదులో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు అబ్దుల్లా అధ్యక్షతన జరిగిన సమావేశంలో యరపతినేని మాట్లాడుతూ రాష్ట్రంలో, గురజాల నియోజకవర్గంలో టీడీపీ ముస్లింలకు చేసిన సేవలు ఏ పార్టీ చేయలేదన్నారు. దుర్మార్గమైన పరిపాలన చేస్తున్న సైకో జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి పంపించే ప్రయత్నం ప్రతి ఒక్క కార్యకర్త తీసుకోవాలన్నారు. ఈ రోజు 4వ తేదీ, జూన్ 4న టీడీపీ జెండా రాష్ట్రంలో, గురజాలలోనూ రెపరెపలాడుతుందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలకు అదనంగా గురజాల నియోజకవర్గంలో మరో ఆరు పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ముస్లింలకు హజ్‌యాత్రకు ఆర్థిక సహాయం, ఇమామ్, మౌజన్‌లకు జీతాలు, మసీదులకు రంగులు వేసేందుకు ఆర్థిక సహాయం అందించానన్నారు. కాసు మహేష్‌రెడ్డి నియోజకవర్గంలో ఒక్క ముస్లింకైనా రూ.10 వేలు ఆర్థిక సహాయం చేశాడా అని ప్రశ్నించారు. కాసు మహేష్‌రెడ్డికి దమ్ము ధైర్యం వుంటే ముస్లింలకు చేసిన పథకాల గురించి తెలపాలన్నారు. తురకపాలెంలో మదర్సా నిర్మాణానికి రూ.10లక్షలు ఇచ్చానని, నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో షాదీఖానాల నిర్మాణానికి, మసీదుల నిర్మాణానికి తనవంతు సహాయ సహకారాలు అందించానన్నారు. పిడుగురాళ్లలో ఈద్గా నిర్మాణానికి 3 ఎకరాల స్థలం కేటాయించానని, అదేవిధంగా తురకపాలెంలో ఈద్గా నిర్మాణానికి ఎకరం స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా తాగునీరు అందిస్తానని, లింకురోడ్లు, గృహాలు, విద్యుత్ వివిధ రకాల ప్రభుత్వ స్కీమ్‌లు అందజేస్తామని స్పష్టంచేశారు. వృద్ధులకు, వితంతువులకు పింఛన్ డబ్బులు ఇవ్వకుండా తన సొంత వారికి రూ.12 వేల కోట్లు కాంట్రాక్టర్‌కు నిధులు అందజేశారని ఆరోపించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బడిగుంచల వెంకటేశ్వర్లు, పల్నాడు జిల్లా మైనారిటీ అధ్యక్షులు అమీర్‌అలీ, యరపతినేని రమేష్, దున్నా చెన్నయ్య చౌదరి, మండల తెలుగుయువత అధ్యక్షులు మస్తాన్‌వలి, మాబువలి, ఎంపిటిసి సైదా, యడ్లపల్లి రామారావు, జమ్మిగుంపుల వెంకటేశ్వర్లు, యామని రామారావు, మల్లయ్య, నరసింహారావు, శౌరిబాబు, కొల్లి కృష్ణమూర్తి, యారాసి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ వడ్డిస్తున్న యరపతినేని శ్రీనివాసరావు తదితరులు

## విలేకరిపై వైసీపీ శ్రేణుల దాడి

సత్తెనపల్లి, ఏప్రిల్ 4 : వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఈద్గా వద్ద జరిగిన ఇఫ్తార్ విందు కవరేజ్‌కి వెళ్ళిన పత్రికా విలేకరి నందిగామ చిట్టిబాబుపై ఆ పార్టీకి చెందిన ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. వైసీపీ నేత ఆహ్వానం మేరకే చిట్టిబాబు అక్కడికి వెళ్లాడు. కార్యక్రమాన్ని వీడియో తీస్తుండగా ఇద్దరు వ్యక్తులు వచ్చి చిట్టిబాబు పై దాడి చేశారు. సెల్‌ఫోన్ లాక్కొని పగల గొట్టారు. తాను విలేకరిని, ప్రోగ్రాం కవరేజ్ కోసం వచ్చానని చెప్పినప్పటికీ వినకుండా దాడి చేశారు. వైసీపీ నేతలు ఆశించినంత మేరకు ఆకార్యక్రమం విజయవంతం కాకపోవటంతో, ఆ విషయం ఎక్కడ బహిర్గత మవుతుందోనన్న ఆందోళనతోనే చిట్టిబాబు పై దాడి చేసినట్టు తెలుస్తుంది.

## ఉచిత కుట్టు శిక్షణా ప్రారంభం

అచ్చంపేట, ఏప్రిల్ 4 : మండలంలోని చెరుకుపాలెం గ్రామంలో స్నేహ హస్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరి ఫౌండేషన్ సహకారంతో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని ప్రముఖ సంఘ సేవకురాలు మామిళ్ళపల్లి విజయలక్ష్మి గురువారం ప్రారంభించారు. శ్రీ వెంకటేశ్వర కమ్యూనిటీ హాల్‌లో కొత్తపల్లి, చింతపల్లి, చెరుకుంపాలెం, పెట్లగూడెం, తాడువాయి గ్రామానికి చెందిన సుమారు 150 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. వీరికి 50 రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు గ్రామాభివృద్ధి సంఘ అధ్యక్షుడు తుమ్మా శౌరిరెడ్డి తెలియ జేశారు. వీరికి రెండు పూటలా శిక్షణా కార్యక్రమం జరుగుతుందని స్నేహ హస్తల కో-ఆర్డినేటర్ తాయి కరిముల్లా బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్నెం భద్రయ్య, సాంబశివరావు, గొటిక సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుంటుపల్లితో 35 ఏళ్ల అనుబంధం

దాచేపల్లి, ఏప్రిల్ 4: టీడీపీ జాతీయ క్రమశిక్షణా కమిటీ సభ్యుడు, నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ మాజీ ఛైర్మన్ గుంటుపల్లి నాగేశ్వరరావుతో తనది 35 ఏళ్ల అనుబంధముందని గురజాల టీడీపీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం గుంటుపల్లి దశదిన కార్యక్రమానికి హాజరైన యరపతినేని శ్రీనివాసరావు వారి కుటుంబ సభ్యులను కలసి గుంటుపల్లితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. గుంటుపల్లి కుటుంబానికి టీడీపీ అండగా వుంటుందన్నారు.

## ఓటర్ల అవగాహన ర్యాలీ

సత్తెనపల్లి, ఏప్రిల్ 4 : పట్టణంలో గురువారం నియోజక వర్గ ఎన్నికల అధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఓటర్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. అర్హులైనవారంతా రానున్న ఎన్నికల్లో ఓటింగ్‌లో పాల్గొనాలని మురళీకృష్ణ పిలుపునిచ్చారు. ధృడమైన ప్రజాస్వామ్యానికై ఓటర్లంతా తప్పనిసరిగా ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. ర్యాలీలో అసిస్టెంట్ ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల అభివృద్ధే టీడీపీ ధ్యేయం

రాజుపాలెం, ఏప్రిల్4: అన్ని వర్గాల అభివృద్ధే టీడీపీ ధ్యేయమని మండల టీడీపీ, జనసేన పార్టీల అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు, తోట నరసయ్యలు తెలిపారు. గురువారం మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామంలో కూటమి నేతలు కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ కూటమి మేనిఫెస్టోలోని పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### అధికారంలోకి రాగానే

## బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం

● నియోజకవర్గ పరిశీలకులు జయప్రకాష్ నారాయణ

రాజుపాలెం, ఏప్రిల్4: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువస్తామని సత్తెనపల్లి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు తాతా జయప్రకాష్ నారాయణ స్పష్టంచేశారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో 'జయహో బీసీ' సందస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ వైసీపీ పాలనలో సుమారు 300 మంది బీసీలను అతి క్రూరంగా హత్యచేయటంతో, ఎంతో మందిపై దాడులు, దౌర్జన్యాలు జరిగాయన్నారు. భవిష్యత్తులో బీసీలపై దాడులను, హత్యలను నిరోధించేందుకు మన పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు బీసీలకు ప్రత్యేక రక్షణచట్టం తీసుకురాబోతున్నారని తెలిపారు. అదే విధంగా టీడీపీ అధికారంలోకి వచాచక, బీసీలకు నెలకు రూ.4 వేలు పెన్షన్ అందజేయనున్న విషయాన్ని గురించి ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లకు తెలియజేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 24 శాతానికి తగ్గించారనే విషయం ప్రతి బీసీ సోదరులకు తెలియజేయాలని సూచించారు. బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత బీసీ రిజర్వేషన్లు తగ్గించటం వలన మన సోదరులు 16,800 మంది రాజకీయ పదవులకు దూరమైయ్యారని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు చిన్నబోయిన రాఘవయాదవ్, పల్నాడు జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పూజల వెంకటకోటయ్య, నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు వెంకట్రావు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు నల్లగోర్ల నరసింహారావు, బీసీ నేతలు లేబాకుల బ్రహ్మయ్య, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



బీసీ డిక్లరేషన్ పత్రాలను ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు





సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

## ప్రజాగళంను జయప్రదం చేయాలి

● సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఏప్రిల్ 4 : పట్టణంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కార్యకర్తలు, అభిమానులు ఈనెల 6న పట్టణంలో జరగనున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రజాగళం రోడ్ షోకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. గురువారం టీడీపీ ప్రజా వేదికలో ప్రజాగళం రోడ్‌షో నిర్వాహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ చిరంజీవి రావు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు తాత జయప్రకాష్ నారాయణలు వివిధ అంశాలపై చర్చించారు. సమావేశంలో నాయకులు చౌట శ్రీనివాసరావు, నూర్ బాషా జానీ బాబు, ఎలినేడి లక్ష్మీతులసీ, భవన్నారాయణ, మన్నవ శారదాదేవి, పూజల వెంకటకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

**చంద్రబాబు రోడ్ షోను జయప్రదం చేయాలి**

ఈనెల 6న పట్టణంలో జరిగే చంద్రబాబు నాయుడు ప్రజాగళం రోడ్ షోకు నియోజకవర్గంలోని తెలుగు మహిళలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని టీడీపీ తెలుగు మహిళా నాయకులు భీమినేని వందనాదేవి, గొర్రెపాటి సుశీల, తోటఅంబిక, మల్లేశ్వరి తదితరులు పిలుపునిచ్చారు.

**ఇఫ్తార్ విందులో పాల్గొన్న కన్నా**

పట్టణంలోని 1వ వార్డు రంగాకాలనీలో టీడీపీ ముస్లీం నాయకులు గురవారం రాత్రి ఇచ్చిన ఇఫ్తార్ విందుకు కన్నా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కన్నా ప్రతి ఒక్కరినీ పలుకరిస్తూ ఇఫ్తార్ విందును వడ్డించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**అమరావతి:** ఈనెల 6వ తేదీన క్రోసూరులో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు నిర్వహించే ప్రజాగళం రోడ్ షోను మండల పరిధిలోని కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది విష్ణు గురువారం ఒక ప్రకటనలో కోరారు.

**వైసీపీని వీడి టీడీపీలోకి చేరికలు**

సత్తెనపల్లి రూరల్: మండలంలోని కందులవారిపాలెం గ్రామానికి చెందిన పది వైసీపీ కుటుంబాలు గురువారం ఆ పార్టీని వీడి మాజీ మంత్రి, నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి కన్నా పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

**ముప్పాళ్ళ :** మండలంలోని కొంకావారిపాలెం ఎస్సీ కాలనీలోని వైసీపీకి చెందిన 10 కుటుంబాలు కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. కన్నా వారికి టీడీపీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరావు, తురకపాలెం సర్పంచ్ మల్లవరపు చంద్రశేఖర్, పలువురు టీడీపి నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

**టీడీపీని గెలిపించాలి : కన్నా నాగరాజు**

రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలిపించాలని గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు అన్నారు. మండలంలోని దమ్మాలపాడులో కన్నా నాగరాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవాయులును గెలిపించాలన్నారు. ఆయన వెంట టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఉన్నారు.

## పారుపల్లిలో మళ్లీ ప్రబలిన జ్వరాలు ..

● అత్యవసర వైద్య శిబిరం ఏర్పాటు

క్రోసూరు, ఏప్రిల్ 4 : క్రోసూరు మండలం పారుపల్లిలో మళ్లీ జ్వరాలు ప్రబలాయి. గ్రామంలో జ్వర పీడితులు అనేక మంది ఉండటంతో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు తక్షణ చర్యల్లో భాగంగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పలువురు జ్వర పీడితులు పరీక్షించి వైద్యసేవలు అందించారు. వైద్యాధికారి డాక్టర్ బాల అంకమ్మబాయి మాట్లాడుతూ గ్రామంలో సీజనల్ జ్వరాలు వ్యాపించాయని, యాంటీ లార్వా ఆపరేషన్‌లు నిర్వహించామని, జ్వరాలు మరింత వ్యాప్తిం చెందకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి గ్రామస్థులకు సూచనలు చేస్తున్నామని తెలిపారు. వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి మందులు పంపిణీ చేశారన్నారు.

## తాగునీటిపై వైసీపీ కుటిల రాజకీయాలు

● అధికారులకు ఫిర్యాదు చేసిన కౌన్సిలర్లు, కూటమి నేతలు

దాచేపల్లి, ఏప్రిల్ 4: తాగునీటి సమస్యతో ప్రజలు తల్లడిల్లిపోతుంటే ఇదే అదునుగా వైసీపీ ఓటర్లను ప్రలోభపెడుతూ కుటిల రాజకీయాలకు పాల్పడుతుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తంగెళ్ల శ్రీనివాసరావు ఆరోపించారు. గురువారం దాచేపల్లి నగర పంచాయతీలో వార్డు కౌన్సిలర్లు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యాలయం వద్దకు వైసీపీ దుశ్చర్యలపై ఫిర్యాదు చేస్తూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. తంగెళ్ల శ్రీనివాస రావు మాట్లాడుతూ నగరపంచాయతీ నిధులతో సరఫరా చేస్తున్న తాగునీటిని తమ సొంత నిధులతో చేస్తున్నట్లుగా ప్రచారం చేసుకోవడం, అధికార పార్టీ సానుభూతి పరుల ఇళ్లకు నీటిని సరఫరా చేయడం దారుణమన్నారు. తాగునీరు సరఫరా ట్యాంకర్లను వైసీపీ నేతల పర్యవేక్షణలో ఉండటాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ విషయంలో కమిషనర్ అధికార పార్టీ నేతలకు వత్తాసు పలుకుతున్నారని, ఇది సహేతుకం కాదన్నారు. ప్రతి వార్డులో నాలుగు బోర్లను ఏర్పాటు చేయాలని, 10 ట్యాంకర్లను అదనంగా తెప్పించాలని, పాత బోర్లకు మరమ్మతులు చేపట్టాలని, నగర పంచాయతీ ద్వారా నడుస్తున్న ట్యాంకర్లకు అధికారులు, సిబ్బంది పర్యవేక్షణలోనే ఉండాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బొమ్మన బోయిన నాగరాజు, వేల్పుల జయమ్మ, బాదం సుబ్బలక్ష్మీ, అంబటి సునీతా రాణి, సీతారామయ్య, ఏసమ్మ, ఖాశింబి తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్లు.. 88 శాతం

● వలంటీర్లకంటే వేగంగా పంపిణీ ● బెడిసికొట్టిన వైసీపీ ఓట్ల రాజకీయం
● నగదు విడుదల కాకే జాప్యం ● వైసీపీ అసత్య ప్రచారాలు పటాపంచలు
● గురువారం మధ్యాహ్నానికే సచివాలయాలు ఖాళీ

గుంటూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వలంటీర్లు లేకపోతే పింఛన్ల పంపిణీ కష్టమని అధికార పార్టీ చేసిన అసత్య ప్రచారాలు పటాపంచలయ్యాయి. గ్రామ/వార్డు సచివాలయాల కార్యదర్శులు వలంటీర్లు చేసే పనిని రోజున్నర వ్యవధిలోనే పూర్తి చేశారు. సచివాలయాలకు పింఛన్‌దారులు వచ్చిందే తడవుగా నిమిషాల వ్యవధిలో వేలిముద్ర ద్వారా ఆధార్ అథెంటికేషన్ చేయించుకుని నగదు చేతిలో పెట్టి పంపించేశారు. దీంతో గురువారం మధ్యాహ్నం నుంచే చాలా సచివాలయాల్లో పింఛన్‌దారులు లేక కౌంటర్లు ఖాళీగా మారాయి. ఇంకా ఎవరైనా పెన్షన్ తీసుకోవాల్సిన వారు ఉంటే వెంటనే రావాలని, సచివాలయాల్లో పలువురు కార్యదర్శులు వాట్సాప్ గ్రూపుల ద్వారా పింఛన్‌దారులకు సందేశాలు పంపించారు. ప్రభుత్వం కనుక రెండు విడతలుగా కాకుండా ఒకే విడతలో నగదు జమ చేసి ఉంటే ఈపాటికి మొత్తం పెన్షన్ల పంపిణీని పూర్తి చేసేవారమని పేర్లు చెప్పడానికి ఇష్టపడని పలువురు సెక్రెటరీలు తెలిపారు. గుంటూరు జిల్లాలో 2,60,830 పింఛన్లను ఈ నెలలో ప్రభుత్వం విడుదల చేయగా గురువారం సాయంత్రానికి 2,14,734(82.33 శాతం) మందికి పంపిణీ పూర్తి చేశారు. అలానే పల్నాడు జిల్లాలో 2,82,105 మందికి 2,48,970(88.25 శాతం), బాపట్ల జిల్లాలో 2,35,945 మందికి 2,02,814(86.32 శాతం) మందికి పంపిణీని పూర్తి చేశారు. అది కూడా ఎలాంటి చిన్నపాటి సమస్యలు కూడా లేకుండానే. ఇదే పనిని ప్రతీ నెలా వారికి అప్పగించినా పింఛన్‌దారుల ఇళ్ల వద్దకే వెళ్లి ఇచ్చేయగలరు. కాగా వలంటీర్లు లేకపోతే పింఛన్ల వ్యవస్థ కుప్పకూలుతుందని ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూసిన వైసీపీకి పెన్షన్ల పంపిణీ శాతం ఏమాత్రం మింగుడు పడటం లేదు. ఈ నెల, వచ్చే నెలలో పింఛన్‌దారులను ఇబ్బంది పెట్టి ఓట్లు కోసం చేసిన నీచ రాజకీయ వ్యూహం బెడిసికొట్టినట్లు అయింది. పింఛన్లు జాప్యానికి కారణం టీడీపీ, బీజేపీ, జనసేన అని మూడు పార్టీలపై నెపం మోపి లబ్ధి పొందాలని చూసిన వైసీపీ ప్రయత్నం బూమరాంగ్ అయింది.

# పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట





టీడీపీ నాయకులతో కలిసి పోస్టర్ విడుదల చేస్తున్న డాక్టర్ చదలవాడ అరవిందబాబు

## 14న హైదరాబాద్‌లో ఆత్మీయ సమావేశం

నరసరావుపేట రూరల్, ఏప్రియల్ 4: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆత్మీయ సమావేశానికి టీడీపీ నాయకులు కార్యకర్తలు అందరూ హాజరుకావాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. నరసరావుపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు టీడీపీ నాయకులతో కలిసి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న నరసరావుపేట వాసుల ఆత్మీయ సమావేశ ఆహ్వాన పోస్టరును విడుదల చేశారు. ఈ నెల 14వ తారీకున జరగబోయే హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో నివసించే నరసరావుపేట వాసుల ఆత్మీయ సమావేశం టీడీపీ సెంట్రల్ ఆఫీస్ ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ బంజారా హిల్స్ రోడ్డు నెంబర్ 2లో జరగబోయే ఆత్మీయ సమావేశానికి ప్రతి ఒక్కరినీ ఆహ్వానిస్తున్నానని ప్రతిఒక్కరూ హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు నరసరావుపేటలో టీడీపీ ఇఫ్తార్

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 4: పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని ముస్లింలకు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఇఫ్తార్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పల్నాడు రోడ్డులో ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ పక్కన 6 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని ముఖ్య అతిథులుగా నరసరావుపేట పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీ వీరాంజనేయులు, నరసరావుపేట అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి చదలవాడ అరవింద బాబు, పల్నాడు జిల్లాలోని టీడీపీ అభ్యర్థులు జనసేన నాయకులు సయ్యద్ జిలానీ తదితరులు హాజరు కానున్నారు. ముస్లింలందరూ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలి

● డీసీసీ అధ్యక్షుడు అలెగ్జాండర్

వినుకొండ టౌన్, ఏప్రిల్ 4: ఉమ్మడి గుంటూరు జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకురావాలని డీసీసీ అధ్యక్షుడు అలెగ్జాండర్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పలువురికి గురువారం పార్టీ పదవుల నియామక పత్రాలు అందజేశారు. పిడుగు విజయ్‌కి రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శిగా, కందుల దేవాకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా, సుధాకర్‌కు పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షుడిగా, హరిబాబుకు నియోజకవర్గ అధికార ప్రతినిధిగా నియామకపత్రాలు అందజేశారు. నూతన కార్యవర్గ సభ్యులంతా పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు బి.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్లను యథావిధిగా పంపిణీ చేయాలి

వినుకొండ, ఏప్రిల్ 4: పట్టణ, పరిసర ప్రాంతాల్లోని పింఛన్‌దారులకు యథావిధిగా ఇంటి వద్దనే పింఛన్లను పంపిణీ చేయాలని అఖిలపక్ష, ప్రజాసంఘాల నాయకులు మున్సిపల్ మేనేజర్‌కు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు షేక్ బీజీ తదితరులు మాట్లాడుతూ సచివాలయ, ప్రభుత్వ ఉద్యోగులతో ఇంటివద్దే పింఛన్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వృద్ధులు, వితంతువులు, సచివాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారని, కనీస వసతుల్లేక ఇబ్బందులు పడుతున్నారని, వేసవిని దృష్టిలో ఉంచుకొని ఇంటివద్దే అందించాలని కోరారు. అఖిలపక్ష నాయకులు ఆర్కే నాయుడు, షేక్ నాగూర్, ఫిరోజ్, రూబేన్, కీర్తిపాటి వెంకటేశ్వర్లు, ప్రజాసంఘాల నాయకులు ప్రసాద్, భరత్ పాల్గొన్నారు.

## వైభవంగా పేరంటాలమ్మ, పోలేరమ్మ శిలాప్రతిష్ఠ

గుర్రంవారిపాలెం (శావల్యాపురం), ఏప్రిల్ 4: మండలంలోని కొత్తలూరు పంచాయతీ పరిధిలోని గుర్రంవారిపాలెంలో నూతనంగా నిర్మించిన దేవాలయాల్లో పేరంటాలమ్మ, పోలేరమ్మ, పోతురాజు స్వాముల శిలాప్రతిష్ఠ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు శేషాచార్యులు, దేవి శ్రీకాంత్‌బట్టర్ ఆధ్వర్యంలో కుంబారాధన, భుక్తహోమం, యంత్రస్థాపన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి మేళతాళాలతో వైభవంగా స్వామివార్ల శిలాప్రతిష్ఠ చేశారు. భక్తులు భారీగా విచ్చేసి స్వామి వార్లను దర్శించుకుని అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

మాజీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం దేవాలయాల్లో భజనా కార్యక్రమాలు నిర్వహించారు.

## నరసరావుపేటలో అగ్నిప్రమాదం

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 4: పట్టణంలోని సాయి నగర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ గృహంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తిరుమలశెట్టి శ్రీనివాసరావుకు చెందిన గృహంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. మంటలు చెలరేగిన వెంటనే శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వారు ఘటనాస్థలికి మంటలను అదుపులోకి తెచ్చారు. సంఘటనలో సుమారు రూ.2 లక్షల మేరకు ఆస్తి నష్టం సంభవించినట్లు అగ్నిమాపక శాఖ సిబ్బంది తెలిపారు.

## ఘనంగా ప్రపంచ అంధత్వ నివారణ వారోత్సవం

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 4: గుంటూరు రోడ్డులోని డాక్టర్ రామలింగారెడ్డి మాక్సీ విజన్ ఐ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో ప్రపంచ అంధత్వ నివారణ వారోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామలింగారెడ్డి మాట్లాడుతూ అంధత్వం వంశపారంపర్యంగా రాకుండా ఐదు విధాలుగా వచ్చే అవకాశం ఉందన్నారు. వాటి నివారణకు 40 సంవత్సరాలు నిండిన వారు ప్రతి సంవత్సరానికి ఒకసారి కంటి పరీక్షలను నిర్వహించుకోవాలన్నారు. చిన్న పిల్లలకు కంటి సమస్యలు ఉంటే త్వరితగతిన స్పందించి వైద్యం చేయించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు పవనేశ్వరరెడ్డి, చెంచిరెడ్డి, ప్రకృతి, శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## 7 నుంచి నాటకోత్సవాలు

యడ్లపాడు, ఏప్రిల్ 4: లింగారావుపాలెం కొండవీటి కళాపరిషత్, యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య నాటకోత్సవాలు ఈ నెల 7 నుంచి నాలుగు రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలుగు నాటక కళాపరిషత్‌ల సమ్మేళనం (వేదిక) అధ్యక్షుడు ముత్తవరపు సురేష్‌బాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గత ఏడాది డిసెంబరులో గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల పరిధిలోని ఏడు నాటిక పరిషత్‌లతో 'వేదికను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. వేదిక ఏర్పడిన తరువాత తొలిసారిగా లింగారావుపాలెం కొండవీడు కళాపరిషత్, యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య నాటకోత్సవాల సంయుక్త ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు జాతీయస్థాయి నాటకోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 7, 8 తేదీలలో రెండు రోజులపాటు లింగారావుపాలెంలోని పోసాని సుబ్బారావు కళావేదికపైన, 9, 10 తేదీలలో యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళాప్రాంగణంలోని ఎంవీ చౌదరి కళావేదికపైన నాటకోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు 3 ప్రదర్శనల చొప్పున నాలుగు రోజులపాటు మొత్తం 12 ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని నాటక సమాజాలకు చెందిన అత్యుత్తమ నాటికలను ఎంపికచేసి ప్రదర్శించడం జరుగుతుందన్నారు.

## నాలుగు గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

చిలకలూరిపేట, ఏప్రిల్ 4: చిలకలూరిపేట మండలంలోని వేలూరు, కుక్కపల్లివారిపాలెం, పసుమర్రు, ఈవూరివారిపాలెం గ్రామాల్లో గురువారం కేంద్ర బలగాల కవాతు జరిగింది. ప్రజలు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని, శాంతిభద్రతలకు భంగం కలిగించేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఈ సందర్భంగా అధికారులు సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ జగదీష్, చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐలు వీ బాలకృష్ణ, జీ రవికృష్ణ పాల్గొన్నారు.



## డ్వాక్రా మహిళలకు నగదు ఎప్పుడు ఇస్తారో చెప్పాలి

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 4: రాష్ట్రంలో సామాజిక పింఛన్‌లపై ఆరోపణలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ డ్వాక్రా మహిళల ఖాతాల్లో రుణమాఫీ నగదు ఎప్పుడు జమ చేస్తారో చెప్పాలని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని 13వ వార్డులో కుటుంబ సాధికార సారథుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టో వివరాలు, సూపర్-6 పథకాలతో కలిగే ప్రయోజనాలు ఇంటింటికి తిరిగి వివరించాలన్నారు. పింఛన్‌లను ప్రతిపక్షాలు, ఎన్నికల సంఘం అడ్డుకుంటున్నాయని దుష్ప్రచారం చేస్తున్న వైసీపీ నేతలు బటన్ నొక్కి రెండు నెలలు గడిచినా ఆసరా, రుణమాఫీ నగదు ఇప్పటివరకు ఎందుకు జమ కాలేదో ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డ్వాక్రా మహిళలకు రుణమాఫీ నాలుగో విడత నిధులు జమ చేస్తామని, జనవరి 23న బటన్ నొక్కారని, ఇన్ని రోజులైనా వారికి డబ్బు జమకాలేదని, ఇవ్వాళ, రేపు అంటూ కళ్ళుకాయలు కాచేలా ఎదురు చూస్తున్న అక్కచెల్లెళ్ళకు ఏ సమాధానం చెపుతారని ప్రత్తిపాటి ప్రశ్నించారు. డబ్బులు లేనప్పుడు, ఇవ్వలేనప్పుడు ముఖ్యమంత్రి బటన్ ఎందుకు నొక్కారో, జగన్ దిక్కుమాలిన రాజకీయాలను ప్రజలు అర్థం చేసుకోవాలని టీడీపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని ప్రత్తిపాటి విజ్ఞప్తి చేశారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

### వైసీపీ దుష్ప్రచారాలను తిప్పి కొట్టాలి: ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 4: రాష్ట్ర భవిష్యత్ రీత్యా అత్యంత కీలకంగా మారిన ప్రస్తుత ఎన్నికల్లో ప్రతిఒక్క ఓటును పట్టుదలగా తీసుకుంటేనే గెలుపుతీరాలకు సునాయాసంగా చేరగలుగుతామని మాజీమంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. అబద్ధాలు, అభాండాలు వ్యాప్తిలో పీహెచ్‌డీ చేసిన జగన్ వైసీపీ తప్పుడు ప్రచారాలను ఎక్కడికక్కడికి ఖండించి ప్రజలకు వాస్తవాలను వివరించాలన్నారు. పట్టణంలోని 32వ వార్డు నుంచి ఎరుకుల సామాజిక వర్గానికి చెందిన 35కుటుంబాలు అవ్వారు రమేష్, బిట్ర బ్రహ్మం, డానియేలుల ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరిని కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి తన నివాసం వద్ద పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో పింఛన్‌ల పేరిట జగన్ చేస్తున్న రాజకీయం అతని ప్రభుత్వానికే కాక మానవత్వానికే మాయనిమచ్చగా అయన పేర్కొన్నారు. ఎన్నికల రోజు నాటికి ఇలాంటి మరెన్నో కుతంత్రాలకు తెరలేపుతారని, వీటిని తిప్పికొట్టడానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ఇంటింటికి తిరుగుతూ వాస్తవాలను వివరించాలని, కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

### పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరిక

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 4: తెలుగుదేశం పార్టీలోకి కొనసాగుతున్న చేరికలే కూటమి విజయానికి సంకేతాలని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మునిగిపోయే నావలా మారిన వైసీపీ కంటే చంద్రబాబు సంక్షేమ నీడలో ఉండటమే మేలనే అభిప్రాయం రోజురోజుకు పెరుగుతుందన్నారు. నాదెండ్ల మండలం అప్పారావు గ్రామానికి చెందిన పంచాయతీ ఉపసర్పంచ్, మండల వైసీపీ మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు మాబూ సుభానీతో పాటు 70కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. పట్టణంలోని ప్రత్తిపాటి నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో వారంతా టీడీపీలో చేరారు. వారిని ప్రత్తిపాటి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నాదెండ్ల మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, అప్పాపురం గ్రామ నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కార్యకర్తలంతా కలసికట్టుగా పనిచేసి తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా శ్రీ కృష్ణ దేవరాయలను గెలిపించాలని ప్రత్తిపాటి విజ్ఞప్తి చేశారు.

## పింఛన్లపై వైసీపీవి నీచ రాజకీయాలు

● పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



వేల్పూరులో టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెన

వినుకొండ, ఏప్రిల్ 4: రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పింఛన్ల పంపిణీలో వైసీపీ ప్రభుత్వం నీచమైన రాజకీయాలకు పాల్పడుతోందని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో గురువారం మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలసి ఆయన ఇంటింటికి తిరిగి టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైఎస్ వివేకానందరెడ్డి హత్య, కోడికత్తి కేసులను రాజకీయంగా వాడుకొని సీఎం జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాడని, ఇప్పుడేమీ దొరక్క పింఛన్‌లపై ఆధారపడ్డ వృద్ధులు, మహిళలను ఎండల్లో ముప్పతిప్పలు పెడుతూ వారి ఉసురు పోసుకొంటున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. స్వార్థం కోసం, ఓట్ల కోసం ఇంత దౌర్భాగ్యానికి, నీచానికి ఒడిగడుతున్న జగన్ లాంటి వ్యక్తిని చరిత్రలో ఎప్పుడూ చూడలేదన్నారు. వలంటీర్ వ్యవస్థకు టీడీపీ ఎప్పుడూ వ్యతిరేకం కాదని, వారిని రాజకీయ కార్యకలాపాలకు దూరంగా ఉంచాలని ఎప్పుడూ చెబుతూనే ఉన్నామన్నారు. వలంటీర్లు లేని రాష్ట్రాల్లో పింఛన్లు పంపిణీ జరగడం లేదా అని హైకోర్టు కూడా ప్రశ్నించిందని ఆయన గుర్తుచేశారు. సొంతవారు, బయటవారనే బేధం లేకుండా అధికారం కోసం ఎంతటికైనా దిగజారుతాడన్నారు. ఆయన ఎన్ని కుయుక్తులు పన్నినా వారికి ఓటమి తప్పదని, కూటమి ప్రభుత్వం రాగానే రూ.4వేలు పింఛన్‌ను ఇంటి వద్దే అందజేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### టీడీపీ కూటమి విజయం ఖాయం

బొల్లాపల్లి, ఏప్రిల్ 4: నమ్మి ఓటువేసిన పాపానికి ప్రజలను ముప్పతిప్పలు పెడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఓటమి ఖాయమని జీవీ ఆంజనేయులు తెలిపారు. ఐదు సంవత్సరాలు అభివృద్ధి అనే మాట మరచి ఇప్పుడు బూతులు తిట్టినంత మాత్రాన ఓటమి నుంచి బొల్లా తప్పించుకునే ప్రసక్తే లేదన్నారు. వినుకొండలో ఫ్యాన్ రెక్కలు విరగటం ఖాయమని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లో తీవ్ర వ్యతిరేకత వైసీపీ ప్రభుత్వంపై ఉందని తెలిపారు. వైసీపీ రాష్ట్ర వ్యాప్తంగా తుడిచి పెట్టుకొనిపోవటం ఖాయమన్నారు. గురువారం సాయంత్రం బొల్లాపల్లి మండలం మర్రిపాలెంకు చెందిన పది కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. జీవీ, మక్కెన సమక్షంలో నెల్లూరి రమణయ్య, పెసల వెంకటనారాయణ, సింగం శివకుమార్, పెద దానం తదితరులు టీడీపీ చేరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు జరపాల గోవిందునాయక్, పెసల వెంకట నారాయణ, నిమ్మకాయల బాబూరావు, పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

### మహిళల అభ్యున్నతే లక్ష్యంగా పథకాలు: హరీష్‌బాబు

బొందిలిపాలెం (శావల్యాపురం), ఏప్రిల్ 4: మహిళల అభ్యున్నతి కోసం ఉమ్మడి మ్యానిఫెస్టోలో చంద్రబాబు మహాశక్తి పేరుతో మహిళలకు ప్రత్యేక పథకాలు రూపొందించారని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తనయుడు గోనుగుంట్ల హరీష్‌బాబు అన్నారు. శంఖారావం కార్యక్రమానికి గురువారం బొందిలిపాలెం గ్రామానికి విచ్చేసిన హరీష్‌బాబుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఘనస్వాగతం పలికారు. హరీష్‌బాబు గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఉమ్మడి మ్యానిఫెస్టోలోని ఆరు పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, జనసేన మండలాధ్యక్షుడు అడపాల అనిల్‌కుమార్, గ్రామపార్టీ అధ్యక్షులు పొనుగోటి వెంకట్రావు, బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల వెంకటేశ్వర్లు, గ్రామనాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే బొల్లా స్వగ్రామం నుంచి టీడీపీలోకి చేరికలు

శావల్యాపురం, ఏప్రిల్ 4: ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వగ్రామమైన శావల్యాపురం మండలం వేల్పూరులో వైసీపీకి చెందిన 20 కుటుంబాల వారు టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సమక్షంలో గురువారం టీడీపీలోకి చేరారు. వినుకొండలోని జీవీ నివాసంలో పార్టీలో చేరినవారికి మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెన మల్లికార్జునరావులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వేల్పూరుకు చెందిన పారా ప్రసాద్, రాజేష్, ముప్పా సురేష్, వేల్పుల రామయ్య, జుంజు వెంకయ్య, రాయవరపు యోగయ్య, వేల్పుల రమేష్, బీర్నీడి లోకయ్య, చింతపల్లి దాసు తదితరులు టీడీపీలో చేరారు. జీవీ మాట్లాడుతూ రానున్న వినుకొండ నియోజకవర్గాన్ని బొల్లా అరాచకాలకు అడ్డాగా మార్చాడని, 40రోజుల్లో ఓడిపోబోతున్న బొల్లాకు ఎవ్వరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మాట్లాడుతూ వినుకొండను ఇంతకాలం పీడించుకు తిన్న బొల్లా రానున్న ఎన్నికల సునామీలో కొట్టుకుపోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, వేల్పూరు గ్రామపార్టీ అధ్యక్షుడు యేగినాటి తిరుపతిరావు, బొల్లా పేరయ్య, దొడ్డా ఏడుకొండలు, సాదినేని కృష్ణమూర్తి, పారా చౌదరి, బోయపాటి మహేష్, జుంజు యోహాన్, సీనియర్ నాయకులు యరమాసు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ఈపూరు మండలంలో ప్రచారం

ఈపూరు, ఏప్రిల్ 4: రాష్ట్రంలో సైకోలను తరిమి కొట్టాలంటే కూటమి విజయంతోనే సాధ్యమౌతుందని వినుకొండ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని భద్రుపాలెంలో గురువారం రాత్రి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ రాష్ట్రానికి పట్టిన దరిద్రం వదిలించుకునే సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలశెట్టి బాలయ్య, శ్రీనివాసరావు, కాటం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్లు.. 88 శాతం

- వలంటీర్ల కంటే వేగంగా పంపిణీ
- బెడిసికొట్టిన వైసీపీ ఓట్ల రాజకీయం
- నగదు విడుదల కాకే... తొలుత జాప్యం
- అధికార పార్టీ అసత్య ప్రచారాలు పటాపంచలు
- గురువారం మధ్యాహ్నానికే సచివాలయాలు ఖాళీ



కొచ్చెర్ల సచివాలయం వద్ద వేచిఉన్న వృద్ధులు

గుంటూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వలంటీర్లు లేకపోతే పింఛన్ల పంపిణీ కష్టమని అధికార పార్టీ చేసిన అసత్య ప్రచారాలు పటాపంచలయ్యాయి. గ్రామ/వార్డు సచివాలయాల కార్యదర్శులు వలంటీర్లు చేసే పనిని రోజున్నర వ్యవధిలోనే పూర్తిచేశారు. సచివాలయాలకు పింఛన్‌దారులు వచ్చిందే తడవుగా నిమిషాల వ్యవధిలో వేలిముద్ర ద్వారా ఆధార్ అథెంటికేషన్ చేయించుకుని నగదు చేతిలో పెట్టి పంపించేశారు. దీంతో గురువారం మధ్యాహ్నం నుంచే చాలా సచివాలయాల్లో పింఛన్‌దారులు లేక కౌంటర్లు ఖాళీగా మారాయి. ఇంకా ఎవరైనా పెన్షన్ తీసుకోవాల్సిన వారు ఉంటే వెంటనే రావాలని, సచివాలయాల్లో పలువురు కార్యదర్శులు వాట్సాప్ గ్రూపుల ద్వారా పింఛన్‌దారులకు సందేశాలు పంపించారు. ప్రభుత్వం కనుక రెండు విడతలుగా కాకుండా ఒకే విడతలో నగదు జమ చేసి ఉంటే ఈపాటికి మొత్తం పెన్షన్ల పంపిణీని పూర్తి చేసేవారమని పేర్లు చెప్పడానికి ఇష్టపడని పలువురు సెక్రెటరీలు తెలిపారు. గుంటూరు జిల్లాలో 2,60,830 పింఛన్లను ఈ నెలలో ప్రభుత్వం విడుదల చేయగా గురువారం సాయంత్రానికి 2,14,734 (82.33 శాతం) మందికి పంపిణీ పూర్తిచేశారు. అలానే పల్నాడు జిల్లాలో 2,82,105 మందికి 2,48,970(88.25 శాతం), బాపట్ల జిల్లాలో 2,35,945 మందికి 2,02,814 (86.32 శాతం) మందికి పంపిణీని పూర్తి చేశారు. అది కూడా ఎలాంటి చిన్నపాటి సమస్యలు కూడా లేకుండానే. ఇదే పనిని ప్రతీ నెలా వారికి అప్పగించినా పింఛన్‌దారుల ఇళ్ల వద్దకే వెళ్లి ఇచ్చేయగలరు. కాగా వలంటీర్లు లేకపోతే పింఛన్ల వ్యవస్థ కుప్పకూలుతుందని ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూసిన వైసీపీకి పెన్షన్ల పంపిణీ శాతం ఏమాత్రం మింగుడు పడటం లేదు. ఈ నెల, వచ్చే నెలలో పింఛన్‌దారులను ఇబ్బంది పెట్టి ఓట్లు కోసం చేసిన నీచ రాజకీయ వ్యూహం బెడిసికొట్టినట్లు అయింది. పింఛన్లు జాప్యానికి కారణం టీడీపీ, బీజేపీ, జనసేన అని మూడు పార్టీలపై నెపంమోపి లబ్ధి పొందాలని చూసిన వైసీపీ ప్రయత్నం బూమరాంగ్ అయింది.

చాలామంది పింఛన్‌దారులు తాము గతంలో వలంటీర్‌కు రూ.200 ఇవ్వాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆ బాధ తప్పిందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. కాగా మంచం నుంచి లేవలేని వాళ్లు, దివ్యాంగుల వద్దకు సచివాలయాల కార్యదర్శులే వెళ్లి పెన్షన్‌ని పంపిణీ చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని ఓ సచివాలయం వద్దకు వైసీపీ నేత వెళ్లి గురువారం తానే పింఛన్లు పంపిణీ చేస్తానని హడావిడి చేసినట్లు తెలిసింది. అయితే అందుకు సచివాలయ సెక్రెటరీలు అంగీకరించలేదు. దీంతో ఎన్నికల తర్వాత వచ్చేది వైసీపీ ప్రభుత్వమే, ఆ విషయాన్ని గుర్తు పెట్టుకోండి అంటూ వారిని హెచ్చరించినట్లు సమాచారం. తలసేమియా వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న కొరిటపాడుకు చెందిన బాలుడికి ఉన్నతాధికారులు అనుమతిస్తే అక్కడికు వెళ్లి రూ.10వేల పింఛన్‌ని ఇచ్చేందుకు సంబంధిత సిబ్బంది సన్నద్ధమయ్యారు.

### శివారు గ్రామాల్లో అందని పింఛన్లు

ఈపూరు, ఏప్రిల్ 4: మండలంలో శివారు గ్రామాల్లోని పలు సచివాలయాల పరిధిలో పింఛన్ల పంపిణీ జరగలేదు. కొన్ని సచివాలయాలకు సగం నగదు మాత్రమే వారి ఖాతాలకు జమకావడంతో అంత వరకే సిబ్బంది పంపిణీ చేశారు. మండలంలో 6వేల 5వందల 88 లబ్ధిదారులకు రూ.కోటి 97లక్షల, 24వేల ఐదువందలు పంపిణీ చేయాల్సి ఉంది. కాని పింఛన్ నగదు బ్యాంకు ఖాతాలో జమకాకపోవడంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. గురువారం కొచ్చెర్ల, కొండాయిపాలెం, బొమ్మరాజుపల్లి, కొండ్రముట్ల, అంగలూరు సచివాలయాల్లో సుమారు రూ.51 లక్షలు పంపిణీ చేయాల్సి ఉంది. నగదు బ్యాంకులో జమకాక కొంత జాప్యం జరిగిందని శుక్రవారం ఇంటింటికి వెళ్లి పంపిణీ చేస్తామని సచివాలయ సిబ్బంది తెలిపారు.



## 90 శాతం మేర పింఛన్లు పంపిణీ

చిలకలూరిపేట, ఏప్రిల్ 4: చిలకలూరిపేట పట్టణం, రూరల్ మండలంలో గురువారం రాత్రి 8:30 గంటల ప్రాంతానికి 90శాతం మందికి పింఛన్ల పంపిణీ పూర్తయింది. అందరికీ ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు పంపిణీ చేశారు. పట్టణ పరిధిలో మొత్తం 11,332 మంది వివిధ రకాల పెన్షనర్లు ఉండగా పదివేల మందికి పైగా పింఛన్లు పంపిణీ చేశారు. మండల పరిధిలో 8,815 మంది పింఛన్‌దారులు ఉండగా సుమారు 7,500 మంది పెన్షనర్లకు ఈ మొత్తాలను అందజేశారు. రాత్రి పొద్దుబోయే సమయానికి లేదా శుక్రవారం మధ్యాహ్నంలోగా నూరుశాతం పంపిణీ పూర్తవుతుందని అధికారుల అంచనాగా ఉంది.

## ఉప్పరపాలెంలో దాహం.. దాహం

- ఐదేళ్ళుగా తాగునీటికోసం ఎస్సీ కాలనీ వాసుల అవస్థలు..
- అధికారం కోసం పోటీ... తెరుచుకోని తాగునీటి శుద్ధి పథకం





ఎస్సీ కాలనీలో రక్షిత తాగునీటి పథకం, కాలనీలో పాడైపోయిన చేతిపంపు



మూసిఉన్న బాలవికాస సంస్థ నిర్మించిన తాగునీటిశుద్ధి పథకం

ఉప్పరపాలెం (ఈపూరు) ఏప్రిల్ 4: మండలంలోని ఉప్పరపాలెంలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. గ్రామస్థులు తాగునీటి కోసం నానా అగచాట్లు పడుచున్నారు. రక్షిత నీటి పథకాలు పనిచేయకపోవడం, గ్రామ చెరువు ఎండిపోవడంతో నీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. ప్రస్తుతం ఎండలు మండుతుండటంతో చెరువులో నీరులేక చేతిపంపులు అడుగంటి పనిచేయడం లేదు. గ్రామంలో సుమారు 350 కుటుంబాలు ఉండగా 1500లమంది జనాభా ఉన్నారు. గ్రామంలో రెండు రక్షిత తాగునీటి పథకాలు ఉన్నాయి. గ్రామంలో ఒకటి, ఎస్సీ కాలనీలో ఒకటి ఉన్నాయి. ఎస్సీ కాలనీలో రక్షిత తాగునీటి పథకం ఐదు సంవత్సరాలుగా పనిచేయడంలేదు. గ్రామంలో ఉన్న రక్షిత తాగునీటి పథకం మాత్రం వారానికి రెండు రోజులు కొంతమేర నీటిని విడుదల చేస్తున్నారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం జలజీవన్ మిషన్ పథకం గ్రామానికి మంజూరు చేశారు. సుమారు రూ.13 లక్షలు నిధులతో గ్రామంలో నీటిని పంపిణీ చేసేందుకు పైపులైన్లు వేశారు. కాని నీటిని మాత్రం విడుదల చేయలేదు. బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశారు. అందుకోసం పంచాయతీ నిధులతో పాటు సామాజిక పింఛన్ లబ్ధిదారుల నుంచి రూ.300లు వసూలు చేశారు. ఆర్వో ప్లాంటును ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభించారు. కాని అధికార పార్టీలోని కొందరు సర్పంచ్‌తో విభేదించి ఆర్వోప్లాంటు నుంచి నీటిని విడుదల చేయకుండా అడ్డుకుంటున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఏదిఏమైనప్పటికి నాయకుల పంతాలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు.

### ఐదేళ్లుగా అవస్థలు పడుతున్నాం

● సురేష్ ఎస్సీ కాలనీ వాసి



గత ఐదేళ్లుగా రక్షిత తాగునీటి పథకం పనిచేయక తాగునీటి కోసం అవస్థలు పడుతున్నాం. కాలనీలో చేతి పంపులు కూడా సక్రమంగా పనిచేయడంలేదు. తాగునీటి కోసం పైపులు వేశారు. నీరు మాత్రం విడుదల చేయలేదు. కొత్తపైపులైన్ కోసం కాలనీలో గుంతలు తవ్వడంతో గోతులు పడి అధ్వానంగా ఉంది.



### నీళ్లు కొనుక్కుంటున్నాం: కమలమ్మ

తాగునీరు లేకపోవడంతో కొచ్చెర్ల నుంచి వస్తున్న డబ్బాల నీళ్లు కొనుగోలు చేస్తున్నాం. 20లీటర్ల డబ్బా రూ.10లు పెట్టి కొనుక్కుంటున్నాము. తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరుకుంటున్నాం.

### తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

● ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జునరావు

గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించడం జరుగుతుంది. జలజీవన్‌మిషన్ పథకం కొంతమేర పూర్తి చేసినప్పటికీ కాంట్రాక్టర్‌కు ఆరోగ్యం బాగలేక నీటిని విడుదల చేయడం ఆలస్యమైంది. గ్రామంలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంటు ద్వారా నీటిని విడుదల చేయడానికి ప్రయత్నిస్తాను.

## 553 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, ఏప్రిల్ 4: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో గురువారం జరిగిన వేలంలో 553 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్ర యించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.12,501 గరిష్ఠధర రూ. 14,150 మోడల్‌ధర రూ.12,250 పలికాయి. కాయ క్వింటాల్ కనిష్ఠ ధర రూ.12,501 గరిష్ఠధర రూ.13,990, మోడల్‌ధర రూ.13,250 పలికాయి.



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన విద్యార్థులతో నడికట్టు రామిరెడ్డి

## పాఠశాల ప్రతిష్ఠను పెంచేలా చదువుకోవాలి

● నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల, ఏప్రిల్ 4: పాఠశాల ప్రతిష్ఠను ఇనుమడింప చేసేలా విద్యార్థులు చదువుకోవాలని హైదరాబాద్‌కు చెందిన గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి అన్నారు. మండలంలోని చిరుమామిళ్ళలో కాసు రాఘవమ్మ, బ్రహ్మానందరెడ్డి ప్రాథమిక పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో రామిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ దివంగత ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి సతీమణి దివంగత రాఘవమ్మతో పాటు తాను కూడా ఈ పాఠశాలలోనే చదువుకొని ఆ స్థాయికి ఎదిగామన్నారు. ఈ సందర్భంగా కంతేరు సుబ్బారావు అనే వృద్ధుడు, పాఠశాల పూర్వ విద్యార్థిని ఆయన సత్కరించారు. విద్యార్థులకు ప్యాడ్‌లు, జామెంట్రీలను అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం క్రాటు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు యా శ్రీనివాసరావు, మూర్తి, సుబ్రహ్మణ్యం, శ్రీదేవి, జోత్స్న, నాగవర్ధని తదితరులు పాల్గొన్నారు.

## ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా ఫేర్వెల్ డే

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 4: స్థానిక ఏ.ఎం.రెడ్డి విద్యాసంస్థలలో గురువారం ఫైనల్ ఇయర్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఫేర్వెల్ డే నిర్వహించినట్లుగా కళాశాల సెక్రటరీ శ్రీమతి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏ.ఎం. రెడ్డి విద్యాసంస్థల సెక్రటరీ శ్రీమతి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి పాల్గొనగా, గౌరవ అతిథులుగా ఏ.ఎం. రెడ్డి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ భార్గవభూషణ్, ఫార్మసీ కళాశాల డీన్ డాక్టర్ లక్ష్మీసురేఖ, డిప్లొమా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీమతి శాంతి మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యనభ్యసించి ఎందరో విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరారని, ఇప్పుడు చదువుతున్న విద్యార్థులకు త్వరలో క్యాంపస్ ప్లేస్మెంట్స్ నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.